
# విశాలభారతి

తెలుగు దిన పత్రిక

epaper:vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ 24.01.2025 | 24 క్యారెట్లు 87,644.00 | కిలో వెండి 98,258.00 | 31 ℃ | సంపుటి:3 | సంచిక:93

www.vishalabharati.com

..మిగతా 2 లో

## ఎండలు మండిపోతాయ్..

- రాష్ట్రంలో ఫిబ్రవరి నుంచి పెరగనున్న తీవ్రత
- 3 రోజుల పాటు అధికంగా పొగమంచు
- హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడి

# స్థానిక ఎన్నికలు ఎప్పుడు..?

## ప్రభుత్వం తర్జన భర్జన



- త్వరగా నిర్వహించాలంటున్న ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నేతలు
- పథకాలు ఇచ్చిన వెంటనే వెళ్తేనే మేలన్న అభిప్రాయం
- బీసీ డెడికేషన్ కమిషన్ నివేదిక పూర్తి
- త్వరలో ప్రభుత్వానికి అందజేత
- సీఎం రేవంత్ రాగానే కీలక నిర్ణయం

" రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు ఎప్పుడు అన్నదానిపై ఇంకా క్లారిటీ రాలేదు. ఎన్నికలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేస్తున్నప్పటికీ ఎప్పుడు నిర్వహించాలా అన్నదానిపై రాష్ట్ర ప్రభుత్వం తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. జనవరి 26 నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ చేపట్టనున్నారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఈ పథకాల పంపిణీ జరుగుతున్న సమయంలోనే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం మంచిదన్న అభిప్రాయం కొందరు ప్రజాప్రతినిధులతో పాటు, కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో ఉంది. సీఎం రేవంత్ రెడ్డి నేడు దావోస్ నుంచి రాష్ట్రానికి తిరిగి రానున్నారు. ఆయన వచ్చిన వెంటనే స్థానిక ఎన్నికలపై చర్చ జరిగే అవకాశం వుంది. బీసీ రిజర్వేషన్‌పై డెడికేషన్ కమిషన్ నివేదిక దాదాపు పూర్తయింది. ఈ నివేదిక అందజేసిన వెంటనే కోర్టుకు ఇచ్చి, రిజర్వేషన్లపై కోర్టు ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికలకు వెళ్లాలని భావిస్తున్నా.., ఈ ప్రక్రియను కూడా వేగంగా చేపట్టాలని పార్టీ నాయకులు అభిప్రాయపడుతున్నట్లు పార్టీవర్గాల సమాచారం. ఫిబ్రవరిలో ఎన్నికలు కాకుంటే మార్చిలో విద్యార్థులకు పరీక్షలు, తర్వాత వేసవి కాలం ఇలా వివిధ అంశాలను పరిగణనలోకి తీసుకొని ఫిబ్రవరిలోనే ఎన్నికలకు వెళ్లే అంశాన్ని పరిగణించాలని కూడా కొందరు ఎమ్మెల్యేలు కోరుతున్నట్లు సమాచారం.





## బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాల్సిందే

- కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి
- సీఎం రేవంత్‌కు ఎమ్మెల్సీ కవిత లేఖ

3 లో

# 16 కంపెనీలు.. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు

## రాష్ట్రానికి పెట్టుబడులు వెల్లువ

- నిన్న ఒక్కరోజే రూ.91,500 కోట్ల ఒప్పందాలు
- అమెజాన్ రూ.60 వేల కోట్లు
- టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ రూ.15వేల కోట్లు
- ఇన్ఫోసిస్, విప్రోల భారీ విస్తరణ
- రాష్ట్ర ప్రభుత్వంతో పలు సంస్థల ఎంఓయూలు
- మొత్తంగా 50వేల మందికి ఉద్యోగావకాశాలు
- గతేడాదితో పోలిస్తే నాలుగు రెట్లు పెరుగుదల
- పారిశ్రామికవేత్తలను ఆకట్టుకున్న ఫ్యూచర్ సిటీ





దావోస్‌లో పెట్టుబడుల సమీకరణలో తెలంగాణ సరికొత్త రికార్డులు నెలకొల్పింది. గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర చరిత్రలో భారీ పెట్టుబడులు సాధించింది. 4 రోజుల పాటు జరిగిన వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో 16 సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఎంఓయూలు కుదుర్చుకుంది. దాదాపు 1,78,950 కోట్ల పెట్టబడులు రాష్ట్రానికి రానున్నాయి. గురువారం ఒక్కరోజే అమెజాన్ (రూ.60 వేల కోట్లు), టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్ (రూ.15 వేల కోట్లు), అక్షత్ గ్రీన్‌టెక్ (రూ.7 వేల కోట్లు), ఉర్సా క్లస్టర్స్ (రూ.5 వేల కోట్లు), బ్లాక్ స్టోన్ (రూ.4,500 కోట్లు) వంటి ఐదు అంతర్జాతీయ దిగ్గజ సంస్థలు తెలంగాణలో రూ.91,500 కోట్ల పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చాయి. ఈ ప్రాజెక్టుల వల్ల సుమారు 50వేల మందికి ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు దావోస్ పర్యటనలో పాల్గొన్నారు.

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వటం ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలను అమితంగా ఆకట్టుకుంది. దీంతో పాటు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణం, మెట్రో విస్తరణకు ప్రభుత్వం ఎంచుకున్న భవిష్యత్తు ప్రణాళికలు పెట్టుబడుల వెల్లువకు దోహదపడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న తెలంగాణ రైజింగ్ 2050 విజన్ గేమ్ ఛేంజర్ గా నిలిచింది. అన్ని రంగాలకు అనుకూలమైన వాతావరణమున్న హైదరాబాద్ గ్రేటర్ సిటీ పెట్టుబడుల గమ్యస్థానంగా మరోసారి ప్రపంచానికి చాటిచెప్పినట్లయింది.

**16 సంస్థలతో ఒప్పందాలు..**

'అమెజాన్' కంపెనీతో అతి పెద్ద పెట్టుబడి ఒప్పందాన్ని కుదుర్చుకుంది. హైదరాబాద్‌లో డేటా సెంటర్లలో రూ.60 వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు అమెజాన్ రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు గురువారం అమెజాన్ వెబ్ సర్వీసెస్ గ్లోబల్ పబ్లిక్ పాలసీ వైస్ ప్రెసిడెంట్ మైఖేల్ పున్‌కేతో భేటీ అయ్యారు. కొత్తగా చేపట్టే విస్తరణ ప్రణాళికలకు అవసరమైన భూమిని కేటాయించాలని అమెజాన్ విన్నవించగా.. సర్కారు అంగీకరించింది. ఏఐ, క్లౌడ్ సర్వీసెస్ డేటా సెంటర్లలో

..మిగతా 2 లో

# అర్హుల్లో చివరి వ్యక్తికీ రేషన్‌కార్డు

- గ్రామసభలపై అసత్య ప్రచారం చేస్తున్న ప్రతిపక్షాలు
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- ఏసీ గదుల్లో కూర్చొని లబ్ధిదారులను ఎంపిక చేయట్లేదు
- ప్రజల సమక్షంలోనే నిర్ణయిస్తున్నాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

అర్హులైనవారిలో చివరి వ్యక్తికీ రేషన్‌కార్డు వచ్చేవరకు దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతుందని రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. సూర్యాపేట జిల్లా కోదాడలోని మార్కెట్ ఆవరణలో గురువారం నిర్వహించిన కోదాడ వ్యవసాయ మార్కెట్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో మరో

..మిగతా 2 లో



3 లో

## గ్రామసభల్లో చదివేదే తుది జాబితా కాదు

- పేర్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందొద్దు
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



# జమ్మూకశ్మీర్‌లో మిస్టరీ మరణాలు

- 200 మంది క్వారంటైన్ కేంద్రాలకు
- మృతులందరిలోనూ ఒకే లక్షణాలు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

జమ్మూకశ్మీర్ రాజౌరీలోని బధాల్ గ్రామంలో మిస్టరీ మరణాలు ప్రజల్లో వణుకు పుట్టిస్తున్నాయి. దీనికి వెనక కారణం ఏంటో సరిగా తెలియడం లేదు. దీంతో అధికారులు ముందు జాగ్రత్త

..మిగతా 2 లో

# రాష్ట్రంలో కొత్తగా 40 లక్షల రేషన్ కార్డులు

- కోటి కుటుంబాలకు సన్న బియ్యం
- దేశానికే రోల్ మోడల్‌గా కోహెడ మార్కెట్
- 200 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో ఏర్పాటు
- హైదరాబాద్ నలు దిక్కులా వ్యూహాత్మక అభివృద్ధి
- ఆదిభట్లలో రతన్ టాటా విగ్రహం
- బీఆర్ఎస్ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డికి అభినందనలు

2 లో





## ఐటీ ఉద్యోగం అంత ఈజీ కాదు..

- వారిని తక్కువ చేసి చూడొద్దు
- అక్కడ రాణించాలంటే విద్య, ప్రతిభ ఉండాలి
- సీఎం వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్

3 లో

# ఇందిరమ్మ ఇళ్లకు 20 లక్షలకు పైగా దరఖాస్తులు

- లబ్ధిదారుల ఎంపికకు మరింత సమయం
- 26న లాంఛనంగా పథకం ప్రారంభం
- గ్రామాల్లో 8 లక్షలకు పైగా అప్లికేషన్లు
- హైదరాబాద్‌లో 10.71 లక్షల దరఖాస్తులు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ఇందిరమ్మ ఇళ్లకు రాష్ట్రవ్యాప్తంగా భారీగా దరఖాస్తులు వస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలో 10.71 లక్షల దరఖాస్తులు వచ్చాయని గృహనిర్మాణ శాఖ అధికారులు తెలిపారు. గురువారం నాటికి 7.50 లక్షల దరఖాస్తుల పరిశీలన పూర్తయిందని, వారం రోజుల్లో మిగతా 3.21 లక్షల అప్లికేషన్ల పరిశీలన పూర్తి చేస్తామని అధికారులు వెల్లడించారు. సర్వే పూర్తి అయిన తరువాతే జీహెచ్‌ఎంసీలో వార్డు సభలు నిర్వహిస్తామని అన్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో 2,249 మంది సిబ్బంది దరఖాస్తుల పరిశీలనలో పాల్గొంటున్నారని

..మిగతా 3 లో

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
24.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com

vishalabharathi Telugu Daily


## ఎండలు మండిపోతాయ్..

విశాలభారతి, స్టేట్ బ్యూరో: రాష్ట్రంలో వచ్చే ఫిబ్రవరి నెల నుంచి ఎండలు మండిపోతాయని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతానికి రాష్ట్రంలో రాగల మూడు, నాలుగు రోజుల పాటు పొగమంచు ప్రభావం అధికంగా ఉంటుందని హైదరాబాద్ వాతావరణ సంచాలకులు డాక్టర్ నాగరత్న తెలిపారు. తూర్పు, ఈశాన్య జిల్లాలతో పాటు హైదరాబాద్ పరిసర జిల్లాల్లో పొగమంచు కురుస్తుందని వాతావరణ శాఖ సంచాలకురాలు వెల్లడించారు. తూర్పు, ఆగ్నేయ గాలుల వల్ల పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని వివరించారు. ఫిబ్రవరి 15 వరకు వాతావరణంలో భిన్న పరిస్థితులు నెలకొంటాయని నాగరత్న చెప్పారు. ఒక్కొక్కప్పుడు చల్లగాలులు, మరొక్కప్పుడు వేడిగాలులు వీస్తాయని, ఫిబ్రవరి 15 తర్వాత వేడి తీవ్రత పెరుగుతుందంటున్న వాతావరణ శాఖ సంచాలకులు డాక్టర్ నాగరత్న ఓ మీడియా ఛానల్ తో మాట్లాడుతూ వెల్లడించారు. తెలంగాణలో వచ్చే మూడు, నాలుగు రోజులు పొగమంచు ఎక్కువగా ఉంటుంది. తెల్లవారుజామున చలిగా ఉంటుంది. తూర్పు, ఆగ్నేయ గాలుల వల్ల పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఫిబ్రవరి 15 వరకు వాతావరణంలో భిన్న పరిస్థితులు నెలకొంటాయి. ఆ తర్వాత ఎండల తీవ్రత పెరగనుందని వాతావరణ శాఖ సంచాలకులు డాక్టర్ నాగరత్న తెలిపారు. దీంతో ఈ ఏడాది వేసవి కాలంలో ఎండ తీవ్రత మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, వడగాలులు కూడా వీయనున్నాయి. ఈ క్రమంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచిస్తోంది.



# డిండి ప్రాజెక్టుతో.. నల్లగొండ జిల్లా సస్యశ్యామలం

- కరువును శాశ్వతంగా పారద్రోలుతాం
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- ప్రాజెక్టు సవరణ అంచనా రూ.6,190 కోట్లు
- అనుమతులు జారీ చేసిన ప్రభుత్వం

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

డిండి ప్రాజెక్టుతో నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రాజెక్టును త్వరితగతంగా నిర్మించి జిల్లాలో కరువును శాశ్వతంగా పారద్రోలుతామన్నారు. డిండి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం కు 6,190 కోట్ల రూపాయల కేటాయించిన సీఎం రేవంత్ రెడ్డికి, సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్లగొండ జిల్లా ప్రజల పక్షాన గురువారం నాడు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. శ్రీశైలం ఫోర్ షోర్ నుంచి ఏదుల రిజర్వాయర్ ద్వారా డిండి, సింగరాజుపల్లి, ఎర్రవల్లిగోకారం, గొట్టిముక్కుల, ఇర్విన్, చింతపల్లి, కిష్టరాంపల్లి, శివన్నగూడెం రిజర్వాయర్లను నింపి వచ్చే మూడేండ్లలో నల్లగొండ జిల్లాలోని ప్రతీ ఎకరాకు సాగునీరు అందిస్తామని ఆయన ప్రకటించారు. ఈ ప్రాజెక్టును వేగంగా పూర్తిచేసి దశబ్దాల సాగునీటి కరువును తరమేయడంతో పాటు, ఫ్లోరైడ్ తో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్న నల్లగొండ జిల్లా ప్రజల త్రాగునీటి కష్టాలను తీర్చుతామని, నల్లగొండ జిల్లా నుంచి ఫ్లోరైడ్ ను శాశ్వతంగా తరమేస్తామని ఆయన చెప్పారు. ఇవాళ అధికారం పోయిందనే బాధలో కుటిల రాజకీయాల కోసం నల్లగొండ జిల్లాలో నిరసన కార్యక్రమాలు చేపడుతున్న ప్రతిపక్షాలు.. పదేండ్లుగా నల్లగొండ జిల్లా ప్రాజెక్టులను ఎందుకు పడావు పెట్టారో ప్రజలకు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నప్పుడు నల్లగొండ ప్రజలను ద్వితీయశ్రేణి పౌరులుగా పరిగణించినవారు, ఇక్కడి ప్రాజెక్టులకు నిధులు ఇవ్వకుండా.. అభివృద్ధికి ఆమడదూరం ఉంచిన నేతలంతా.. అధికారం పోవడంతో నల్లగొండ మీద పడ్డారని ఆయన ఎద్దేవా చేశారు. 70 శాతం పూర్తయిన SLBC టన్నెల్ పనులను పదేండ్లలో ఎందుకు పూర్తి చేయలేదని ఆయన నిలదీశారు. మాది ప్రజల ప్రభుత్వం, ప్రజా ప్రభుత్వమని.. దశబ్ద కాలంగా అభివృద్ధికి దూరంగా ఉన్న నల్లగొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజాప్రభుత్వం రావడంలో కీలకపాత్ర పోషించిన నల్లగొండ ప్రజల రుణం తీర్చుకుంటామని ఆయన ప్రకటించారు.



# 16 కంపెనీలు.. 1.78 లక్షల కోట్ల పెట్టుబడులు

తరువాయి భాగం

రూ.60,000 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. అలాగే సన్ పెట్రో కెమికల్స్.. భారీ పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్తు, సోలార్ విద్యుత్తు ప్రాజెక్టుల ఏర్పాటు. నాగర్ కర్నూలు, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో ప్లాంట్లు. 3400 మెగావాట్ల పంప్డ్ స్టోరేజీ హైడ్రో విద్యుత్తు. 5440 మెగావాట్ల సోలార్ విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది. రూ. 45,500 కోట్ల పెట్టుబడులతో 7వేల ఉద్యోగాలు కల్పించనుంది. హైదరాబాద్‌లో రూ.15 వేల కోట్ల పెట్టుబడులతో 300 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటుకు అమెరికాకు చెందిన 'టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్' సంస్థ ముందుకొచ్చింది. ఏఐ ఆధారిత అప్లికేషన్లు, క్లౌడ్ సేవలు, డేటా ప్రాసెసింగ్‌కు ఈ డేటా సెంటర్ ఉపయోగపడుతుంది. అలాగే రూ. 10,000 కోట్ల పెట్టుబడితో తెలంగాణలో అత్యాధునిక ఏఐ డేటాసెంటర్ క్లస్టర్. 400 మెగా వాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్ ఏర్పాటుకు కంట్రోల్ ఎస్ కంపెనీ ఒప్పందం కుదుర్చుకుంది. 3,600 మందికి ఉపాధి లభించనుంది. రాష్ట్రంలో మానవ రహిత ఏరియల్ సిస్టమ్స్ తయారీ యూనిట్ ఏర్పాటుకు జేఎస్ డబ్ల్యూ ఒప్పందం కుదుర్చుకుంది. రక్షణ రంగంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు తెలంగాణ అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు క్రియాశీలంగా మారనుంది. రూ.800 కోట్ల పెట్టుబడులతో 200 ఉద్యోగాల కల్పన జరగనుంది. తెలంగాణలో ఇంటిగ్రేటెడ్ ప్రైవేట్ రాకెట్ తయారీ, ఇంటిగ్రేషన్ మరియు టెస్టింగ్ యూనిట్ ఏర్పాటు కోసం స్కైరూట్ ఏరో స్పేస్ రూ.500 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. మేఘా ఇంజినీరింగ్ (MEIL) మూడు కీలక ఒప్పందాలు చేసుకుంది. రాష్ట్రంలో 2160 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ఇంధన ఉత్పత్తి ప్రాజెక్ట్. బ్యాటరీ ఎనర్జీ స్టోరేజీ సిస్టమ్ ప్రాజెక్టు. అనంతగిరిలో వరల్డ్ క్లాస్ లగ్జరీ వెల్‌నెస్ రిసార్ట్. రూ.15000 కోట్ల పెట్టుబడులు, 5,250 మందికి ఉపాధి లభించనుంది. హైటెక్ సిటీలో 3.20 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హెచ్‌సీఎల్ కొత్త క్యాంపస్ ఏర్పాటు చేయనుంది. దీనిద్వారా 5వేల మందికి ఉపాధి లభించనుంది. హైదరాబాద్‌లో విప్రో కంపెనీ భారీ విస్తరణకు ముందుకొచ్చింది. గోపన్‌పల్లి క్యాంపస్‌లో కొత్త ఐటీ సెంటర్ ఏర్పాటుతో 5వేల మందికి ఉద్యోగాలు రానున్నాయి. హైదరాబాద్‌లో ఇన్ఫోసిస్ క్యాంపస్ విస్తరణ చేపట్టనుంది. పోచారంలో ఐటీ క్యాంపస్‌లో రూ.750 కోట్లతో కొత్త సెంటర్ ఏర్పాటు కానుంది. దీనిద్వారా 17,000 ఉద్యోగాలు రానున్నాయి. కామారెడ్డి జిల్లాలో పామాయిల్ ఫ్యాక్టరీ, రిఫైనింగ్ యూనిట్, రాష్ట్రంలో బాటిల్ క్యాప్‌లను ఉత్పత్తి చేసే కొత్త తయారీ యూనిట్ ఏర్పాటుకు యూనిలివర్ కంపెనీ ముందుకొచ్చింది. దాదాపు వెయ్యి ఉద్యోగాలు కల్పించనుంది. అమెరికాకు చెందిన కంపెనీ ఉర్సా క్లస్టర్స్ అత్యాధునిక అర్టిఫిషియల్ డేటా సెంటర్ హబ్‌ను స్థాపించనుంది. రూ. 5000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ప్రపంచ అగ్రగామి సంస్థ బ్లాక్‌స్టోన్ హైదరాబాద్‌లో 150 మెగావాట్ల డేటా సెంటర్ ఏర్పాటు చేయనుంది. ₹4,500 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. అక్షత్ గ్రీన్ టెక్ (మైత్రా ఎనర్జీ గ్రూప్ కంపెనీ): అత్యాధునిక సోలార్ సెల్స్, మాడ్యూల్స్ తయారీ యూనిట్ ఏర్పాటు చేయనుంది. రూ.7,000 కోట్ల పెట్టుబడులు పెట్టనుంది. ఆరోగ్య సంరక్షణలో ప్రపంచంలో పేరొందిన ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్ కంపెనీ దాదాపు 800 మంది ఉద్యోగులు పనిచేసేందుకు వీలుగా హైదరాబాద్‌లో నూతన కార్యాలయం ఏర్పాటు చేయనుంది. సంగారెడ్డిలో ప్రస్తుతమున్న సుహానా ప్లాంట్ పక్కనే కొత్తగా ఎక్సెలెన్స్ సెంటర్ ఏర్పాటు చేయనుంది.

# రాష్ట్రంలో కొత్తగా 40 లక్షల రేషన్ కార్డులు

- కోటి కుటుంబాలకు సన్న బియ్యం
- దేశానికే రోల్ మోడల్‌గా కోహెడ మార్కెట్
- 200 ఎకరాల్లో రూ.2వేల కోట్లతో ఏర్పాటు
- హైదరాబాద్ నలు దిక్కులా వ్యూహాత్మక అభివృద్ధి
- ఆదిభట్లలో రతన్ టాటా విగ్రహం
- బీఆర్ఎస్ దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డికి అభినందనలు





విశాలభారతి, స్టేట్ బ్యూరో:

రాష్ట్రంలో కొత్తగా 40 లక్షల రేషన్‌కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందజేస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. మొత్తం కోటి కుటుంబాలకు రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం అందజేస్తామని ప్రకటించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్తగా ఒక్క కార్డు మంజూరు చేయలేదని, ఇప్పుడు పనిగట్టుకుని ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని ఆయన కోరారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్లలో ఆదిభట్ల మంగల్‌పల్లి మధ్య రూ.25 కోట్లతో నిర్మించనున్న నాలుగు లేన్ల రహదారికి మంత్రి కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ.. గ్రామసభల్లోనే ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతుభరోసా, రేషన్ కార్డులకు అర్హులను ఎంపిక చేస్తున్నామని తెలిపారు. ఆనాడు రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1 లక్ష రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని.. ఇవాళ అవి రూ.10 లక్షలతో సమానమన్నారు. మా సంక్షేమ కార్యక్రమాలు చూసి కేటీఆర్, హరీష్ రావుకు మైండ్ బ్లాంక్ అయ్యిందని.. ఈ సంక్షేమం వల్ల బీఆర్ఎస్ పార్టీని ప్రజలు మరిచిపోతరని పనికిమాలిన ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మేం విమర్శలను పట్టించుకోమని.. న్యాయమైన సలహా ఎవ్వరు ఇచ్చినా స్వీకరిస్తామన్నారు. గ్రామ సభలు ఈ వారం రోజులతో అయిపోయేది కాదని నిరంతర ప్రక్రియ అని.. ఇవ్వాళ సభ అయిపోతే ఎట్లా అనే ఆందోళన అవసరం లేదన్నారు. రేషన్ కార్డులు ఎప్పుడు కావాలంటే అప్పుడు తీసుకునేలా ఏర్పాటు చేస్తున్నామని ప్రజలకు భరోసానిచ్చారు. ఫార్మాసిటీ వద్దని ఆనాడే పోరాడామని 14 వేల ఎకరాల్లో ఫార్మాసిటీ వస్తే కాలనీ కాలనీలు లేచిపోవాల్సి వస్తుందని.. ఒక్క పరిశ్రమతో ఎల్ బీ నగర్ ఇవ్వాళ చాలా ఇబ్బంది పడుతుందని మంత్రి తెలిపారు. వాళ్లది ప్రజల్ని చంపే ఫార్మాసిటీ విధానం, మాది యువతకు ఉద్యోగాలు కల్పించే స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, డాటా సెంటర్ వంటి భవిష్యత్ డెవలప్ మెంట్ యాక్టివిటీస్ మీద పనిచేస్తున్నామన్నారు. అందుకే వేల కోట్ల రూపాయల కంపెనీలు హైదరాబాద్ కు వస్తున్నాయని తెలిపారు. ఇప్పటికే దాదాపు లక్ష కోట్ల రూపాలయ పెట్టుబడులు పెట్టడానికి తెలంగాణ ప్రభుత్వంతో వివిధ కంపెనీలు ఒప్పందం చేసుకున్నాయన్నారు. ఇక్కడి ప్రజల్ని ఇబ్బందిపెట్టేందుకు.. అప్పటి ఎమ్మెల్యే అసైన్డ్ భూములు కొని ఫార్మాసిటీకి ఇచ్చిండని.. ఫార్మాసిటీ అనేది ప్రజలు లేని రిమోట్ ప్రాంతాల్లో ఉండాలని కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రభుత్వం వచ్చిన మూడు రోజులకే నిర్ణయం తీసుకున్నామన్నారు. హైదరాబాద్ నలుదిక్కులా అభివృద్ధి జరిగేలా ప్రభుత్వం వ్యూహాత్మకంగా, ప్రణాళికబద్ధంగా ముందుకు సాగుతుందన్నారు. అందుకే శామీర్ పేట వరకు మెట్రో విస్తరణకు మంజూరీ ఇచ్చామన్నరు. ఆనాడు ఎంపీగా, ప్రతిపక్ష పార్టీలో ఉండే అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేశామని.. ఇప్పుడు అధికారంలో ఉన్నామని.. తాను, ఎమ్మెల్యే కలిసి ఇబ్రహీం పట్నం ను అద్భుతంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.

**దేశానికే మోడల్‌గా కోహెడ మార్కెట్..**


రైతుల ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే ప్రభుత్వం కాంగ్రెస్‌అని రోడ్లు భవనాల శాఖ మంత్రి కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో దేశానికి మోడల్‌గా ఉండే మార్కెట్‌ను నిర్మించబోతున్నామని అన్నారు. కోహెడ ప్రాంతంలో రూ.2వేల కోట్ల వ్యయంతో 2 ఎకరాల్లో ఆధునాతన హంగులతో ఏర్పాటుకు శ్రీకారం చూడుతున్నామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గంలో నిర్ణయం చేయడం జరిగిందని వివరించారు. సీఎంతో పాటు మరొకోద్ది మంది పెద్దలతో మార్కెట్ పనుల శంఘుస్థాపన జరగనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

**ఆదిభట్లలో రతన్ టాటా విగ్రహం..**

రతన్ టాటా చేస్తున్న దాతృత్వ కార్యక్రమాలకు గుర్తింపుగా రాష్ట్ర ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా ఆదిభట్లిలో ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. దావోస్ నుంచి తిరిగి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చించి సైట్‌ను ఖరారు చేయనున్నారు. "గొప్ప పరోపకారి రతన్ టాటా తన సంపదలో సగానికి పైగా భారతదేశ ప్రజలకు విరాళంగా ఇచ్చారు మరియు అతని కంపెనీలు ఈ ప్రాంతంలో వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. టాటా సీఎస్ఆర్ నిధులతో ఐటీఐలను ఆధునీకరించడంతోపాటు నైపుణ్య కేంద్రాలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోంది'' అని తెలిపారు. NH65, RRR మరియు ఇతర జాతీయ మరియు రాష్ట్ర రహదారుల విస్తరణతో సహా రహదారి మరియు రైల్వే అభివృద్ధి పనులపై కూడా మంత్రి చర్చించారు.

## ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ నిరంజన్ రెడ్డిపై మంత్రి ప్రశంసలు..

గురువారం నాడు ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ తో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఆదిభట్ల నుండి కొంగరకలాన్ చౌరస్తా మీదుగా మంగళపల్లి వరకు 25 కోట్ల రూపాయల నిధులతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు, ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు మాట్లాడుతూ ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలు అందుతాయని ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు, ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో పట్టుబట్టి అధిక నిధులు తీసుకొచ్చారని.. ఆదిభట్ల మున్సిపాలిటీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు, ఆదిభట్ల మున్సిపాలిటీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు, త్వరలో మరిన్ని నిధులు వెచ్చించి ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు, ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, మున్సిపాలిటీల చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీల అధ్యక్షులు, కౌన్సిలర్లు, జడ్పీటీసీలు, ఎంపీపీలు మాజీ సర్పంచులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, మార్కెట్ డైరెక్టర్లు, కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.



# అర్హుల్లో చివరి వ్యక్తికీ రేషన్‌కార్డు

తరువాయి భాగం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి పాల్గొని మాట్లాడారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 26 నుంచి 4 పథకాలను అమలు చేస్తున్నామని, వీటికోసం గ్రామసభల్లో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేస్తుంటే ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తూ గొడవలు సృష్టిస్తున్నాయని.. సామాజిక మాధ్యమాల్లో ఆ వీడియోలు వైరల్ చేసి ప్రభుత్వంపై బురద జల్లుతున్నాయని మండిపడ్డారు. అర్హులందరికీ ఈ 4 పథకాలు అందుతాయన్నారు. గ్రామసభల్లో వెల్లడించే జాబితాలో పేరు లేనివారు ఆందోళన చెందకుండా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రజల్లో 72 శాతానికి పైగా ప్రజలకు రేషన్‌కార్డులు అందుతాయని తెలిపారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం మాదిరిగా ఏసీ గదుల్లో కూర్చొని లబ్ధిదారులను ఎంపిక చేయట్లేదని, ప్రజల సమక్షంలో నిర్ణయిస్తున్నామని అన్నారు. ఇది ఇందిరమ్మ రాజ్యమని పేర్కొన్నారు. కొందరు దీక్ష చేస్తామని హడావుడి చేస్తున్నారని.. రైతులకు రుణమాఫీ చేసినందుకా, బోనస్ చెల్లించినందుకా, రైతుభరోసాను పెంచి ఇస్తున్నందుకా, రూ.1,000 కోట్లతో రైతులకు పరికరాలు అందజేసే పథకాన్ని పునరుద్ధరించినందుకా.. ఎందుకు దీక్ష చేస్తున్నారో వారు స్పష్టం చేయాలన్నారు. పాలేరుకు సీతారామ ప్రాజెక్టు నుంచి గోదావరి జలాలు తీసుకురావడమే తన జీవితాశయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, జిల్లా గ్రంథాలయ అభివృద్ధి సంస్థ చైర్మన్ రామారావు, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ తిరపమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జమ్మూకశ్మీర్‌లో మిస్టరీ మరణాలు

తరువాయి భాగం

చర్యలు చేపట్టారు. దాదాపు 200 మందిని క్వారంటైన్ కేంద్రాలకు తరలించారు. బాధిత కుటుంబాలతో తరచూ కలుస్తుండే వారితో పాటు అంత్యక్రియల్లో పాల్గొన్న వారిని.. ముందు జాగ్రత చర్యలో భాగంగా క్వారంటైన్‌కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత, సౌకర్యాలతో వీరిని అందులో ఉంచారు. కంటైన్‌మెంట్ జోన్ 1.. మరణాలు సంభవించిన అన్ని కుటుంబాలను కవర్ చేస్తుంది. బాధిత కుటుంబాల నివాసాలు సీల్ చేస్తారు. కంటైన్‌మెంట్ జోన్ 2లో.. బాధిత కుటుంబాల సన్నిహితులుగా గుర్తించిన అన్ని కుటుంబాలకు చెందిన వ్యక్తుల నివాసాలు దీని కిందకు వస్తాయి. వీరి ఆరోగ్య పరిస్థితులను వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తుంటారు. కంటైన్‌మెంట్ జోన్ 3.. గ్రామంలో మిగిలిన అన్ని నివాసాలు దీని పరిధిలోకి వస్తాయి. ఇక్కడి ప్రజలు ఎటువంటి ఆహారం తీసుకుంటున్నారు. సామూహిక భోజనాలు నిషేధం. లాగ్ బుక్‌ల నిర్వహణ వంటి అంశాలను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. అయితే.. చనిపోయిన వారందరిలో ఒకే విధమైన లక్షణాలను గుర్తించారు. మెదడు, నాడీ వ్యవస్థ దెబ్బతినడం వంటి లక్షణాలు కనిపించాయని వైద్య ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ మిసర్టీ వెనక ఉన్న కారణాలను తెలుసుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాగా.. బధాల్ గ్రామంలో నెలన్నర వ్యవధిలో 17 మంది అనూహ్యరీతిలో ప్రాణాలు కోల్పోయారు. ఈ అంతుచిక్కని మరణాలతో అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.

vishalabharathi Telugu Daily

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

శుక్రవారం,
24.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# ఇందిరమ్మ ఇళ్లకు 20 లక్షలకు పైగా దరఖాస్తులు

తరువాయి భాగం

పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసుకోని వారు వార్డు సభల్లో కొత్తగా దరఖాస్తులు ఇవ్వొచ్చని సూచించారు. మొదటి దశలో ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను కట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాని ప్రకారం జీహెచ్ఎంసీలోని 24 నియోజకవర్గాలకు 84,000 ఇళ్లు నిర్మించాల్సి ఉంటుంది.

**గ్రామసభల్లోనూ భారీ దరఖాస్తులు**

ప్రస్తుతం జరుగుతున్న గ్రామసభల్లో ఇందిరమ్మ ఇళ్ల కోసం పెద్దఎత్తున దరఖాస్తులు వస్తున్నాయి. ఇప్పటి వరకు సుమారు 8 లక్షల అర్జీలు వచ్చాయి. వీటిని పరిశీలించిన తర్వాతే పూర్తిస్థాయి జాబితాపై దృష్టి సారించాలని ప్రభుత్వం భావిస్తోంది. 'ప్రజాపాలన'లో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం మొత్తం 80.54 లక్షల దరఖాస్తులు వచ్చాయి. లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రేటర్ హైదరాబాద్ మినహా మిగతా అన్ని జిల్లాల్లో 100 శాతం యాప్ సర్వే పూర్తయింది. అయితే, తాము దరఖాస్తులిచ్చినా.. సర్వేయర్లు ఎవరూ రావడం లేదని పలు చోట్ల ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో గ్రామసభల్లో మళ్లీ దరఖాస్తులు తీసుకుంటున్నారు. ప్రభుత్వం మొదటి విడతలో సొంత స్థలం ఉన్నవారికి ఇళ్లను మంజూరు చేస్తామని ప్రకటించింది. అలాంటివారు 13 లక్షల మంది ఉన్నట్లు యాప్ సర్వేలో తేలింది. జనవరి 26వ తేదీన పథకాన్ని ప్రారంభించినా.. లబ్ధిదారుల పూర్తి స్థాయి జాబితా రావడానికి మరింత సమయం పట్టే అవకాశాలు ఉన్నాయని హౌసింగ్ శాఖ అధికారులు అంటున్నారు. లబ్ధిదారుల జాబితాకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం తప్పనిసరని.. ఇలాంటి ప్రక్రియలన్నీ పూర్తికావడానికి మరికొంత సమయం అవసరమని చెబుతున్నారు.

**ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆత్మహత్యాయత్నం..**

మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో గత 3 రోజులుగా గ్రామసభలు నిర్వహిస్తున్నారు. పలుచోట్ల గ్రామాల్లో ఆందోళనలు జరుగుతున్నాయి. తమ పేర్లు జాబితాలో రాని వారు అధికారులపై మండిపడుతున్నారు. ఈరోజు ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామపంచాయతీ పరిధిలో ఓ వ్యక్తి తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయబోయాడు.



# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాల్సిందే

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడానికి ఇంకెంత కాలం తాత్సారం చేస్తారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే కులగణన పూర్తి చేసి రిజర్వేషన్లు పెంచుతామని కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ద్వారా కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఇంకా అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ మేరకు గురువారం నాడు ఎమ్మెల్సీ కవిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. బీసీలకు ఏటా రూ. 20 వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ. లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి 202425 బడ్జెట్‌లో అరకొర కేటాయింపులు చేసి తొలి ఏడాదే కామారెడ్డి డిక్లరేషన్‌ను సీఎం రేవంత్ రెడ్డి ఉల్లంఘించారని విమర్శించారు. కాబట్టి కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల బీసీ వర్గాల్లో ఏ మాత్రం విశ్వాసం లేదని, ఈ వైఖరితో రాష్ట్రంలో బీసీలంతా తీరని అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు.

**డెడికేటెడ్ కమిషన్ పేరిట కాలయాపన..**

"కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రధాన హామీ అయిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించడం. "కుల గణన, బీసీ కమిషన్ నివేదిక ఆధారంగా అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోపే బీసీలకు రిజర్వేషన్ల పెంపు" అని కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో స్పష్టంగా పేర్కొని ఉంది. 6 నెలలు గడిచాయి... ఏడాది గడిచింది.. అయినా కూడా రిజర్వేషన్ల పెంపునకు అతీగతీ లేదు. అశాస్త్రీయంగా బీసీ గణన నిర్వహించి, డెడికేటెడ్ కమిషన్ పేరిట కాలయాపన చేయడమే మీ ఆలోచనగా కనిపిస్తోంది." అని తెలిపారు. కులగణన పూర్తయ్యి కూడా చాలా కాలం అవుతుందని, కానీ ఇప్పటి వరకు ప్రభుత్వం ఆ వివరాలను బహిర్గతం చేయలేదని ఎండగట్టారు. ఆ వివరాలను తక్షణమే బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందని, డెడికేటెడ్ కమిషన్ నివేదిక సిద్ధమైనట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో తదుపరి కార్యాచరణపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. " బీసీల అంశాల పట్ల మీ ప్రభుత్వం ఎందుకు అంత నిర్లక్ష్యం వహిస్తోంది ? బీసీలంటే కాంగ్రెస్ పార్టీకి ఎందుకు చులకన ? 6 నెలల్లోపే అమలు చేస్తామన్న హామీ 12 నెలలు గడిచినా ఎందుకు అమలు చేయడం లేదు ? హామీని అమలు చేయడానికి ఇంకెంత కాలం పడుతుంది..?" అని ప్రశ్నల వర్షం కురిపించారు.

రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాల్సిందే.. బీసీలకు ఇచ్చిన హామీ ప్రకారం రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాల్సిందేనని తేల్చిచెప్పారు. కుంటిసాకులు చెప్పి ఇచ్చిన మాట కంటే తక్కువ రిజర్వేషన్లు కల్పిస్తే మాత్రం తెలంగాణ సమాజం మిమ్మల్ని సహించబోదని, బీసీల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ పార్టీ మీ మెడలు వంచి హామీని అమలు చేయించుకుంటామని హెచ్చరించారు. కాబట్టి ప్రభుత్వం తక్షణమే స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లను తక్షణమే 42 శాతానికి పెంచడానికి చర్యలను ముమ్మరం చేయాలని ముఖ్యమంత్రికి ఎమ్మెల్సీ కవిత విజ్ఞప్తి చేశారు.

# ఉద్యోగులకు 186 శాతం పెరగనున్న పెన్షన్?

**విశాలభారతి, నేషనల్ బ్యూరో:** కేంద్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులకు భారీ ఊరట లభించనుంది. 8వ పే కమిషన్ సిఫార్సులు అమలు చేస్తే ప్రస్తుతం ఉన్న పెన్షన్ 186 శాతం మేర పెరగనున్నట్లు తెలిసింది. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే 8వ పే కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. 2026 జనవరి 1 నుంచి 8వ పే కమిషన్ సిఫార్సులు అమలు కానున్నాయి. దీని వల్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పెన్షన్లు, అలవెన్సులు, ఇతర బెనిఫిట్స్ భారీగా పెరగనున్నాయి. 8వ పే కమిషన్ 2.86 ఫిట్‌మెంట్‌ను సిఫార్సు చేయవచ్చని ప్రచారం జరుగుతోంది. ఒక వేళ ఇది అమలు అయితే నెలవారీ పెన్షన్లు భారీగా పెరుగుతాయి. 2016లో 7వ పే కమిషన్ 2.57 ఫిట్‌మెంట్ ప్రకటించింది. దీంతో బేసిక్ పే భారీగా పెరిగింది. అప్పట్లో కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు కనీసం రూ.9 వేల పెన్షన్ ఇవ్వాలని నిర్ణయించారు. అలాగే పెన్షన్‌ను రూ.1.5 లక్షలకు దాట కూడదని నిర్ణయించారు. దీంతో పాటు 53 శాతం డీఆర్ ఇవ్వాలని నిర్ణయించారు.






# అంగరంగ వైభవంగా జరిగిన విజ్ఞాన్స్ వరల్డ్ వన్ పాఠశాల 11 వార్షికోత్సవ వేడుకలు

విశాల భాతరతి:

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శ్రీ జిష్ణుదేవ వర్మగారు విచ్చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజ్ఞాన్ విద్యా సంస్థల వైస్ చైర్ పర్సన్ శ్రీమతి రాణి రుద్రమదేవి గారు స్వాగతోపన్యాసం ఇస్తూ శ్రీ లావు రత్తయ్య గారు ఉన్నత ఆశయంతో విజ్ఞాన్ విద్యా సంస్థ స్థాపించారు. ఎందరినో ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దారు. నేడు విజ్ఞాన్ రెండు తెలుగు రాష్ట్రాలలో సుపరిచితమని వేలాదిమంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని, దీనికి కారణం ఎప్పటికప్పుడు టీచింగ్ లెర్నింగ్ తో పాటు విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడే విధంగా కర్కిలమ్ తయారు చేయడమని చెప్పారు. ముఖ్య అతిథి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ గౌరవనీయులు శ్రీ జిష్ణు దేవవర్మ గారు మాట్లాడుతూ "వసుధైక కుటుంబం" అన్న భారత సూక్తిని ప్రతిబింబిస్తున్న "వరల్డ్ వన్" స్కూల్ పేరు, పేరుకు తగినట్లే ప్రపంచస్థాయి హంగులు, విశాల మైదానాలు, పచ్చని చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం నన్ను ఆకట్టుకుంది. ఇలాంటి వాతావరణంలో విద్యార్థులు అద్భుతంగా రాణిస్తారని తెలియజేశారు. భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కొనేలా విద్యార్థులకు చిన్నతనము నుండే చక్కని శిక్షణ, బోధన అందచేయాలని, మరి ముఖ్యంగా విలువలను నేర్పించగలగాలని, ఈ విషయంలో మేధావులు ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ గారి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన జాతీయ విద్యా విధానంలోని సూచనలు అన్నిటిని విజ్ఞాన్ పాటిస్తుంది కనుక విజ్ఞాన్ విద్యార్థులు వివిధ రంగాలలో అగ్రగాములుగా ఉన్నారని నేను విశ్వసిస్తున్నాను అన్నారు. విద్యార్థులను ఉద్దేశించి "మీకు ఇష్టమైన ఏ రంగంలోనైనా ఉన్నత స్థితికి మిమ్మల్ని మీరు తీర్చిదిద్దుకోవాలని, విషయ విశ్లేషణ, సమస్యల పరిష్కారం, సృజనాత్మకత వంటి నైపుణ్యాలతో పాటు సమాజ సేవ , ప్రకృతి ఆరాధన , నైతిక విలువలు మొదలైన లక్షణాలు అలవర్చుకోవాలి. కొత్త విషయాన్ని నేర్చుకోవాలి. గ్రంథ పఠనం చేయాలి. ఇష్టమైన ఒక కళలో అభినివేశం ఉండాలి. ప్రపంచ స్థాయిలో భారతదేశ కీర్తి ప్రతిష్ఠలు వ్యాప్తి చేయాలి." అన్నారు. తల్లిదండ్రు ఉద్దేశించి మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుండి 'నేను 'నాది' కాకుండా మనము, మన దేశం, అందరూ బాగుండాలనే విశాల భావాలు , మంచి విలువలు నేర్పించాలని చెప్పారు. పిల్లలతో కాసేపు గడపమని వాళ్ళు చెప్పే విని మంచి వాటిని ప్రోత్సహించమని హితబోధ చేశారు. భారతదేశ భవిష్యత్తు విద్యార్థుల పైన, విద్యార్థుల భవిష్యత్తు ఉపాధ్యాయుల మీద ఉందని ఉపాధ్యాయులు తల్లిదండ్రులు తమ బాధ్యతను సక్రమంగా నిర్వహించాలని, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. తర్వాత గౌరవ అతిథి డి. ఆర్. డి. ఒ శాస్త్రవేత్త శ్రీ భగవతిరావు గారు మాట్లాడుతూ అనంతరం విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య గారు తల్లిదండ్రులను ఉద్దేశించి ప్రసంగిస్తూ కొత్త విషయాలను నేర్చుకునే అవకాశాన్ని పిల్లలకు ఇవ్వమని ఈరోజుల్లో పిల్లలు తోటి పిల్లలతో కలిసి ఉంటున్నారా గమనిస్తూ ఉండండి. ఈ 21వ శతాబ్దంలో కోఆపరేషన్, కోఆర్డినేషన్, సోషలైజేషన్ అనేవి చాలా ముఖ్యం అని అన్నారు. పిల్లలతో స్టీవ్ జాబ్స్ అలెన్ మస్క్ వంటి వారి విజయ గాథలను చదివించమని చెప్పారు. భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవటం మానసికంగా శారీరకంగా ఆరోగ్యంగా ఉండటం ముఖ్యమని పిల్లలకు సూచించారుతరువాత విజ్ఞాన్ వరల్డ్ వన్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి ఎస్. వందన గారు వార్షిక నివేదికను సమర్పించారు. విద్యా సంవత్సరంలో విద్యార్థులు సాధించిన ఘన విజయాలను తెలియజేశారు. గత ఏడాది పదవ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థుల విద్యార్థులు నిర్వహించిన సేవాకార్యక్రమాలను స్క్రీన్ ద్వారా చూపించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమములో విజ్ఞాన్ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డా. సందీప్ క్రాంతి కిరణ్ గారు, ప్రిన్సిపల్స్, కోఆర్డినేటర్స్, వైస్ ప్రిన్సిపల్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




# గ్రామసభల్లో చదివేదే తుది జాబితా కాదు

- పేర్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందొద్దు
- అనర్హుల పేర్లుంటే విచారణ జరిపిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

గ్రామసభల్లో చదివి వినిపించేదే తుది జాబితా కాదని, ఈ నెల 26వ తేదీ నుంచి అమలు కాబోతున్న నాలుగు సంక్షేమ పథకాల జాబితాలో పేర్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందొద్దని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలోని కేశవాపురం, తిప్పారెడ్డిగూడెం, జల్లేపల్లి, హైదర్‌సాయిపేట, పడమటితండా, జోగులపాడు, చంద్రుతండా, మహ్మదాపురం గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి గురువారం శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామసభలను పరిశీలించారు. జల్లేపల్లిలో నిర్వహించిన గ్రామసభలో పొంగులేటి మాట్లాడుతూ.. జాబితాలో అనర్హుల పేరున్నట్టు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే విచారణ జరిపిస్తామని, వాస్తవమని తేలితే తొలగిస్తామన్నారు. జాబితాలో పేరు రానివారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమస్యాత్మక గ్రామాల్లో మరోసారి గ్రామసభలు నిర్వహించి, అర్హులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని జల్లేపల్లి, హైదర్‌సాయిపేట, జోగులపాడు గ్రామాల రైతులు ప్రస్తావించగా.. అర్హులందరికీ అమలవుతుందని మంత్రి హామీ ఇచ్చారు. టీఎస్ఐడీసీ ఛైర్మన్ మువ్వా విజయబాబు తదితరులు పాల్గొన్నారు.



# ఐటీ ఉద్యోగం అంత ఈజీ కాదు..

- వారిని తక్కువ చేసి చూడొద్దు
- అక్కడ రాణించాలంటే విద్య, ప్రతిభ ఉండాలి
- సీఎం వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్

విశాలభారతి, స్టేట్ బ్యూరో:

'ఆధునిక సాంకేతిక ప్రపంచానికి ఐటీ నిపుణులే వెన్నెముక.. ఐటీ ఉద్యోగం అంత ఈజీ కాదని తెలుసుకో..' అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. 'కేటీఆర్ ఐటీ ఎంప్లాయ్ కాబట్టి అదే మైండ్‌సెట్‌తో ఆలోచిస్తారు. నేను పొలిటీషియన్‌ని, పాలసీ మేకర్‌ను.. నాకు అన్నీ.. తెలవాల్సిన అవసరం లేదం'టూ దావోస్‌లో సీఎం చేసిన వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా కేటీఆర్ స్పందించారు. 'నన్ను ఐటీ ఉద్యోగి అంటూ.. తక్కువ చేసి మాట్లాడే ప్రయత్నం చేసిన వాళ్లకు ఒకటే చెప్పదలుచుకున్నా.. ఐటీ రంగంలో రాణించాలంటే విద్య, ప్రతిభ, అంకిత భావం చాలా అవసరం. సంచుల కొద్దీ డబ్బులతో ఎమ్మెల్యేలను కొనడానికి, ఢిల్లీ బాసులకు డబ్బులు పంపించడానికి ఇలాంటివేమీ అవసరం లేదు' అని ఎద్దేవా చేశారు. 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఐటీ ఉద్యోగులు ఎంతో కష్టపడి వారి జీవనోపాధిని పొందుతున్నారు. ఐటీ రంగంలో ఉన్న నా అక్కాచెల్లెళ్ళకు, అన్నాదమ్ముళ్లకు సలాం. మీ మేధస్సు, అవిశ్రాంత శ్రమే లేకుంటే ప్రగతి రథచక్రాలు ఆగిపోతాయి. మీ నిబద్ధతకు కొందరు యాక్సిడెంటల్ రాజకీయ నాయకులు సరితూగరు. అలాంటి వాళ్లు ప్రవేశపెట్టే అనాలోచిత విధానాలకు భారీ మూల్యం చెల్లించుకుంటున్నాం' అని పేర్కొన్నారు.



## "లింకు రోడ్లు పనులు చేపట్టండి"

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని యాచారం సాగర్ హైవేకు గ్రామాలను కలుపుతూ వెళ్లే ఆర్ అండ్ బిలింక్ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వెంటనే రోడ్డు మరమత్తులు విస్తరణ పనులు చేపట్టాలనీ గడ్డమల్లాయ్య గూడ మాజీ సర్పంచ్ గుండ్లపల్లి సురేందర్ రెడ్డి సినిమాటోగ్రఫీ రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ని గురువారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి రోడ్లు విస్తరణ, మరమత్తులు చేపడుతామని హామీ ఇచ్చారు. అనంతరం గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల నుండి మాల్ వరకు సాగర్ హైవే ఆరు లైన్ల రోడ్డు విస్తరణ చేపట్టుతున్నట్లు తెలిపారు.



## మూగజీవులను వేటాడితే కఠినంగా శిక్షిస్తాం

**వాజేడు, విశాలభారతి:**

అడవి జంతువులను వేటాడే ఉద్దేశంతో అటవీ ప్రాంతంలో , పంట చెనుల వద్ద కరెంటు తీగలను అమర్చి జంతువులను వేటాడితే కఠినంగా శిక్షిస్తామని వాజేడు మండల పరిధిలోని పేరూరు ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎవరైనా కరెంటు తీగలను అమర్చినట్లయి తే వారి మీద చట్టపరమైన కఠిన చర్యలను తీసుకుంటామని ఆయన హెచ్చరించినా రు. ఉన్నతాధికారుల సూచనల మేరకు గురువారం పేరూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని భువనపల్లి గ్రామంలో గ్రామస్థులతో మాట్లాడి వారికీ తగు సూచనలు ఇచ్చారు. జంతువులను వేటాడే ఉద్దేశంతో అటవీ ప్రాంతంలో పంట చేన్ల వద్ద కరెంటు తీగలను అమర్చడం వలన జరిగే ప్రమాదాల గురించి తగు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిఎఫ్ జవాన్లు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఘనంగా నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు

**నేరేడుచర్ల, విశాలభారతి:**

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నేరేడుచర్ల బిజెపి కార్యాలయంలో చంద్రబోస్ జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకురాలు, హుజూర్నగర్ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్ల శ్రీలతరెడ్డి మాట్లాడుతూ సుభాష్ చంద్రబోస్ ఆశయాలను, ఆలోచనలను సాధించే దిశలో యువత ఎల్లప్పుడూ సిద్దంగా ఉండాలని తెలియజేశారు. పట్టణ అధ్యక్షులు కొణతం నాగిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులు నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలని, అందరూ దేశ ఐక్యత కు పాటుపడాలని, తెలియజేశారు. మండల అధ్యక్షులు గొడ్డేటి పవన్ కుమార్ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్యం సాధించడంలో సుభాష్ చంద్రబోస్ త్యాగాన్ని, ధైర్యాన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కౌన్సిల్ మెంబర్ బాల వెంకటేశ్వర్లు , జిల్లా కౌన్సిల్ మెంబర్స్ సంకలమద్ది సత్యనారాయణరెడ్డి, పార్తనబోయిన విజయ్ కుమార్ ,పట్టణ ఉపాధ్యక్షులు ఉరిమళ్ళ రామమూర్తి , జూలూరి అశోక్ , మండల ప్రధాన కార్యదర్శి పగిడి శ్రీనివాస్ , పట్టణ కిసాన్ మోర్చా అధ్యక్షులు తాళ్ల నరేందర్ రెడ్డి ,మండల, పట్టణ బూత్ అధ్యక్షులు పుల్లెంల సతీష్ గౌడ్ , ఏమిరెడ్డి శంకర్ రెడ్డి , కాలం నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



## జానలదిన్నె గ్రామ ఎమ్మార్పీఎస్ కమిటీల ఎన్నిక

**నేరేడుచర్ల, విశాలభారతి:**

మండలంలోని పత్తేపురం, జానలదిన్నె గ్రామ ఎమ్మార్పీఎస్ కమిటీలను గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పత్తేపురం గ్రామ అధ్యక్షుడిగా ఒగ్గు వీరబాబు మాదిగ, ఉపాధ్యక్షులుగా సిద్దపంగ రవి,మచ్చ వెంకన్న,ప్రధాన కార్యదర్శిగా వట్టేపు ఉపేందర్,కార్యదర్శిగా అమరారపు సైదులు,కోశాధికారిగా మచ్చ వెంకన్న,అధికారి ప్రతినిధిగా రెడపంగ సందీప్, అధ్యక్షులు,మచ్చ గోపాల్,గౌరవ సలహాదారు,మచ్చ పాపుల,కార్యవర్గ సభ్యులు ఎన్నుకున్నారు. జానలదిన్నె గ్రామ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా ఎల్. వీర కృష్ణ మాదిగ, ఉపాధ్యక్షుడుగా తక్కెళ్ళ నాగార్జున, ప్రధాన కార్యదర్శిగా మెరిగెల వెంకటయ్య, కోశాధికారిగా మచ్చ వెంకన్న, కార్యదర్శిగా తక్కెళ్ళ అంజయ్య, ఎల్. సోమయ్య, తక్కెళ్ళ సందీప్, నాగరాజు, నవీన్, నరేష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు ఇంజమూరి మల్లయ్య, మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి యడవెల్లి చంద్రయ్య, ఎమ్మార్పీఎస్ మండల పార్టీ అధ్యక్షుడు యడవెల్లి అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## జానంపేటలో రసాభాసగా గ్రామ సభ

**పినపాక, విశాలభారతి:**

జానంపేట గ్రామంలో ఈరోజు నిర్వహించిన గ్రామసభ రసాభాసగా మారింది.ప్రజాపాలనలో 4 పథకాల అర్హుల జాబితాలో భాగంగా రేషన్ కార్డుల జాబిత మరియు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల పేర్లు పూర్తిగా వెల్లడించడం జరిగింది. కానీ ఇందిరమ్మ ఇండ్ల విషయంలో లబ్ధిదారుల పేర్లు కాకుండా అర్హుల జాబితా అని 450 పేర్లను చదివి గ్రామ సభకు వచ్చిన ప్రజలను తప్పు దోవ పట్టించడం జరిగింది. ఈ విషయంలో అధికారులపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ గ్రామ సభకు వచ్చిన ప్రజలు ఎందుకు వచ్చామా అని మధ్యలోనే కొంతమంది వెను తిరగడం జరిగింది. అధికారులకు ప్రజలకు తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ గ్రామ సభకు హాజరైన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు పూర్తిగా నిరుపేదలైన వారికి



మాత్రమే ఇందిరమ్మ ఇండ్ల అర్హులుగా ప్రకటించాలని, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లో కూడా అర్హులైన పేర్లను జాబితాలో చేర్చాలని అధికారులకు తెలియపరచడం జరిగింది.ఈ కార్యక్రమానికి ప్రజల పక్షాన బి ఆర్ ఎస్ పార్టీ నాయకులైన ముదునూరి రవిశంకర్ వర్మ, ఇంతకముందు పొనుగోటి కామేశ్వరరావు, పొనుగోటి భద్రయ్య, గుండం దామోదర్, గాండ్ల అశోక్, గుండు లక్ష్మయ్య, సిరిండి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# బండారు మల్లయ్య భౌతిక కాయానికి నివాళులు

- **ఎమ్మెల్యేలు మందుల సామేలు, వేముల వీరేశం**

**శాలిగౌరారం, విశాలభారతి:**




శాలిగౌరారం మండలం ఉప్పలంచ గ్రామంలో ఈనెల 21న పశ్చార్థుల చేతిలో మాజీ గ్రామ సర్పంచ్ బండారు మల్లయ్య(53) తీవ్రంగా గాయపడి హైదరాబాదులోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. ఎస్సై సైదులు తెలిపిన వివరాల ప్రకారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ మల్లయ్య కు అదే గ్రామానికి చెందిన రుద్రారం యాదయ్య, రుద్రారం మల్లేష్ ,రుద్రారం చిన్న యాదయ్య కు గత కొంతకాలంగా వ్యక్తిగత గొడవలు ఉన్నట్లు తెలిపారు. మంగళవారం గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్దకు బైకుపై వెళ్తున్న మల్లయ్య పై యాదయ్య మల్లేష్ చిన్న యాదయ్య తో పాటు మరికొందరు గుర్తు తెలియని వ్యక్తులు మరణ ఆయుధాలతో దాడి చేశారు. మృతుడి భార్య చంద్రనిల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గురువారం మాజీ సర్పంచ్ బండారు మల్లయ్య భౌతిక కాయానికి స్థానిక ఎమ్మెల్యేలు మందుల సామేలు,వేముల వీరేశం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బండారు మల్లయ్య మరణం బాధాకరమని ఎమ్మెల్యే దిగ్భ్రాంతికి గురయ్యారు. బండారు మల్లయ్య పై దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. బండారు మల్లయ్య కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్యేలు మందుల సామేలు,వేముల వీరేశం భరోసానిచ్చారు. బండారు మల్లయ్య భౌతిక గాయానికి నివాళులు అర్పించిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందాల సమరం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు అన్నెబోయిన సుధాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుని వెంకటయ్య, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బండపల్లి మాజీ జెడ్పిటిసి మాద యాదగిరి,నాయకులు ఇంతియాజ్, చామల మహేందర్ రెడ్డి, చాడ సురేష్ రెడ్డి ,ధనంజయ, వేముల గోపీనాథ్ ,బొల్లికొండ గణేష్ మండల వ్యాప్తంగా పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు బండారు మల్లయ్య అంత్యక్రియలో పాల్గొని నివాళులు అర్పించారు.




## ప్రతి పేదవారికి లబ్ధిచేకుర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- **తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి**

**నూతనకల్, విశాలభారతి:**

ప్రజా పాలనలో భాగంగా నూతనకల్ మండల కేంద్రంలో జరిగిన గ్రామసభలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అర్హత కలిగిన వారి జాబితా ఆమెదించుకొనుట కొరకు నిర్వహించిన గ్రామ సభ కార్యక్రమంలో పాల్గొన్న తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు ఈ నాలుగు పథకాలో పేర్లు లేని వారు మళ్ళీ దరఖాస్తు చేసుకోవచ్చు అని ప్రతి పేదవారికి లబ్ధిచేకుర్చడమే ప్రభుత్వ లక్ష్యం అని ,పథకాలు సమర్థవంతంగా అమలుచేసి రైతులు, పేదల కండ్లలో ఆనందం చూడడమే మన ప్రభుత్వం లక్ష్యం అని అన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ నాగం జయసుధ రెడ్డి అధికారులు ఏ ఓ మురళిబాబు , ఎస్సై మహేంద్రనాద్ ఏఎస్ వెంకటేశ్వర్ రెడ్డి,రాజేష్, జానయ్య, నవీన్ ,వెంకన్న, రవి శర్మ అంగన్వాడీ సిబ్బంది, గ్రామ సిబ్బంది, గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నాగ సుధాకర్ రెడ్డి, పల్స లింగయ్య, బంటు బద్రి, బద్ధం ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



## కత్తురోజు రామాచారికి ఘన నివాళులు

**నూతనకల్, విశాలభారతి:**

మిర్యాల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కత్తురోజు రామాచారి అనారోగ్య కారణాల వలన చనిపోవడం జరిగింది.వారి పార్దివదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు జెన్నారెడ్డి వివేక్ రెడ్డి . వారు మాట్లాడుతూ కత్తురోజు రామాచారి మృతి పార్టీకి తీరని లోటు అని మిర్యాల గ్రామానికి వైద్యపరంగా, రాజకీయంగా సేవలు అందించారని తెలిపారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు మెంచు చక్రయ్య ,దరిపెల్లి వీరన్న , కట్ట మల్లారెడ్డి ,ఉపేందర్ రావు, మండల కాంగ్రెస్ నాయకులు అనంతుల వెంకన్న, రామచంద్రరావు,ఇరుగు కిరణ్ , అనంతుల శ్రీను,గుణగంటి వెంకన్న, కనకటి పల్ల వెంకన్న, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## సంక్షేమ పథకాలను అందించడమే గ్రామ సభల ముఖ్య ఉద్దేశం

- **ఎమ్మెల్యే బిఎల్ ఆర్**

**అడవిదేవులపల్లి, విశాలభారతి:**

రేషన్ కార్డు ప్రక్రియ ప్రభుత్వం నిరంతరం కొనసాగిస్తుంది సంక్షేమ పథకాల ఎంపికలో పారదర్శకంగా అర్హులును గుర్తిస్తాం అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడానికే గ్రామ సభలు ముఖ్య ఉద్దేశమని మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం అడవిదేవులపల్లి మండల రైతు వేదికలో గ్రామ సభలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాల మేరకు రైతు భరోసా , నూతన రేషన్ కార్డు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇల్లు ఈ నాలుగు సంక్షేమ పథకాలు ఈనెల 26 నుండి అమల్లోకి తేవాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో గతంలో జరిగిన సర్వే ఆధారంగా రూపొందించిన ప్రాథమిక జాబితా పరిశీలన కోసం, అర్హులను గుర్తించడం కోసం ఈనెల 21 తారీకు నుండి 24వ తేదీ వరకు మండల వ్యాప్తంగా గ్రామ సభలో నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు.రేషన్ కార్డు ప్రక్రియ ప్రభుత్వం నిరంతరం కొనసాగిస్తుంది ఏలాంటి అపోహలు నమ్మొద్దని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాల అమలు అయ్యే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు, గ్రామ ప్రజలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పథకాలపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

- **కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ నియోజకవర్గం అధ్యక్షులు పాల్వాయి నాగరాజు**

**నూతనకల్, విశాలభారతి:**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 6 గ్యారంటీ పథకాలపై ప్రతిపక్ష నేతలు చేస్తున్న అసత్య ప్రచారాలు మానుకోవాలని కాంగ్రెస్ పార్టీ సేవా దళ్ నియోజకవర్గం అధ్యక్షులు పాల్వాయి నాగరాజు అన్నారు గురువారం మండల కేంద్రంలో మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజాపాలన కొనసాగుతుందని అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు . ఏడాది కాలంలోనే ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, పథకాలు అమలు అయ్యాయని తెలిపారు అర్హులైన వారందరికీ నూతన రేషన్ కార్డులను, ఆత్మీయ భరోసా, రైతు భరోసా, రేషన్ కార్డులో పేరు నమోదు కానీ వ్యక్తులకు నూతనంగా నమోదు చేసుకునే అవకాశం, వంటి అనేక సదుపాయాలను కల్పిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం రేవంత్ రెడ్డి కే దక్కిందని అన్నారు. గత పాలనా కాలంలో గడిచిన 10 సంవత్సరాలలో కుటుంబ నియంత పాలనా కొనసాగిందని విమర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాణాల సుదర్శన్ రెడ్డి సురకంటి చంద్రారెడ్డి, అనంతల వెంకన్న బాణాల మల్లారెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బత్తుల నాగమల్లు, పులుసు రవి కుసు వెంకన్న, బత్తుల వెంకటనర్సు, సురేష్,నాగార్జున మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
24.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



## రెండవ రోజు ప్రజా పాలన గ్రామసభలు



**విశాలభారతి, ఎల్కతుర్తి**

ఎల్కతుర్తి మండలంలో వివిధ గ్రామాలలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరిచినటువంటి ప్రజా పాలన గ్రామసభ కార్యక్రమాలు కొనసాగించారు. కొన్ని గ్రామాలలో అందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రుణమాఫీ కానందున ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన గ్రామాలు దండేపల్లి జిలుగుల జగన్నాథపూర్ తదితర గ్రామాల్లో సజావుగా గ్రామసభలు నెలకొన్నాయి.




# అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

- సిపిఎం మణుగూరు మండల కమిటీ డిమాండ్

**మణుగూరు, విశాలభారతి:**

ఉపాధి హామీ పనులతో సంబంధం లేకుండా వ్యవసాయ కూలీలందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని, ఇంటి స్థలం లేనివారికి స్థలం కేటాయించి డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, సిపిఎం మణుగూరు మండల కమిటీ డిమాండ్ చేసింది. గురువారం మండలంలో హడావుడిగా కేటాయించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కు సౌకర్యాలు కల్పించాలని, అర్హులుగా ప్రకటించిన వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలని జరిగిన గ్రామసభలో సిపిఎం పార్టీ మండల కమిటీ డిమాండ్ చేసింది. మండలంలోని సమితి సింగారంలో జరిగిన ప్రజా పాలన గ్రామసభలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు అధికారులను, స్థానికను ఈ అంశాలపై సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. సుమారు 5000 మంది వ్యవసాయ పనులకు పగిడేరు సాంబయగూడెం తెర్లాపురం , కూనవరం, సమితి సింగారం గ్రామాలలోని పంట పొలాలకు కూలి పనులు చేయడం కోసం వెళ్తున్నారని వారందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం వర్తింపచేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఉపాధి పనులు చేయడానికి స్థలమే లేకపోవడంతో ఉపాధి పనులు చూపించలేని పరిస్థితి ఏర్పడిందని అందుకోసం ఉపాధి పనులతో సంబంధం లేకుండా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలు చేయాలని అన్నారు. సొంత స్థలం లేని పేదలకు స్థలం కేటాయించి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో హడావుడిగా డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించారని అక్కడ మంచినీళ్లు కరెంటు, డ్రైనేజీ, రోడ్లు ఎటువంటి సౌకర్యాలు లేవని, వెంటనే అక్కడ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నెల్లూరి నాగేశ్వరరావు, కొడిశాల రాములు, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.





# అభివృద్ధిలో అగ్రగామిగా అమీన్ పూర్ మున్సిపాలిటీ

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- 6 కోట్ల 82 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు

**పటాన్ చెరు,విశాలభారతి**

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్ పూర్ మున్సిపాలిటీని అభివృద్ధిలో అగ్రగామిగా తీర్చిదిద్దుతున్నామని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులలో 6 కోట్ల 82 లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు పనులకు స్థానిక మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డితో కలిసి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం లాలాబావి కాలనీలో నూతనంగా నిర్మించిన రిజర్వాయర్ నుండి మంచినీటి సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలో దశాబ్ద కాలంగా అపరిచితంగా ఉన్న రక్షిత మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడం జరిగిందని తెలిపారు.. ఐదు భారీ రిజర్వాయర్ నిర్మించి ప్రతి ఇంటికి మంచినీటి కనెక్షన్లు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి కాలనీలో సిసి రోడ్లు వీధిదీపాలు. పార్కుల నిర్మించి.. అభివృద్ధిలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, ఆయా వార్డుల కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# దివ్యాంగుల అభ్యున్నతికి కృషి

**తొర్రూరు, విశాలభారతి:**

దివ్యాంగుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు సిడిపిఓ కమలాదేవి అన్నారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని రైతు వేదికలో దివ్యాంగులు వయవృద్ధులకు సహాయ ఉపకరణాల ఎంపికపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ మాట్లాడుతూ.. దివ్యాంగులను మానవతా దృక్పథంతో చూడాలని, వారికి చేయూత అందించేందుకు కృషి చేయాలని కోరారు. దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమాజంలో వివక్షకు గురవుతున్న దివ్యాంగులు వయోవృద్ధులను ఆదరించాలని కోరారు. ఉపకరణాల సాయంతో వయోవృద్ధులు దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం పెంపందుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏ సిడిపిఓ విజయలక్ష్మి, సూపర్వైజర్లు శ్రీదేవి మల్లీశ్వరి సునీత నాగమణి శోభ విజయ, సిబ్బంది వెంకన్న, బిక్షపతి అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రణాళిక బద్ధంగా డివిజన్లోని సమస్యలను పరిష్కరిస్తా

- GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి.

**ఎల్బీనగర్ ,విశాలభారతి:**

మన్సూరాబాద్ డివిజన్ ఆగమయ్య నగర్ కాలనీలో ఎన్నో సంవత్సరాలుగా వరద సమస్యతో బుడదమయంగా ఉండే రోడ్డు సమస్యను వ్యయం: 20.30 లక్షలతో సాంక్షన్ చేయించి నూతనంగా నిర్మించిన సి.సి రోడ్డును కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ దాదాపు వనస్థలిపురంలో నుండి 50 కాలనీల పైన నుండి వచ్చే వర్షపు నీరు మా డివిజన్ పరిధిలోని ఆగమయ్య నగర్ కాలనీ నుండి పెద్ద చెరువులోకి వెళ్లే ట్రంక్ లైన్ ఉండడం వలన ప్రతిసారి వర్షాకాలంలో మరియు చిన్న వరద వచ్చిన నీట మునిగి ప్రతిక్షణం సమస్యగా ఉండే ఎన్నో సంవత్సరాల సమస్యను నూతన సి.సి రోడ్లు నిర్మించడంతో పరిష్కరించుకోవడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మిడిదొడ్డి ఆంజనేయులు,సెక్రటరి సతీష రెడ్డి,జనార్దన్ రెడ్డి,వసుధ,సుజాత, వసంతి,కుదీరంబోస్,వెంకటాచారి, శ్రీరాములు,కృష్ణారెడ్డి మరయు బీజేపీ నాయకులు కార్యకర్తలు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# లక్ష్మీనరసింహస్వామి నూతన ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

- ముఖ్య అతిథులుగా హాజరైన మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి సునీత మహేందర్ రెడ్డి ఇంచార్జి బండి రమేష్

**కూకట్పల్లి,విశాలభారతి:**

మూసాపేట్ లోని శ్రీ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ ఆలయ నూతనకమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం వందల మంది భక్తుల మధ్య ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాలక మండలి సభ్యుల ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారానికి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జి సునీత మహేందర్ రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి బండి రమేష్ హాజరయ్యారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ తూము శ్రీహరి పటేల్ కమిటీ సభ్యులు తూము రేఖ, గురుజాల నరేష్, ఠాకూర్ శిశుపాల్ సింగ్, పముదురుగా రాజు, వడాల వెంకటేష్, మైసయ్య యాదవ్ లత్ ప్రమాణ స్వీకరణ చేయించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం, మూసాపేట్ మాజీ సర్పంచ్ తూము శ్రీనివాస్ రావు, బ్లాక్ అధ్యక్షులు, నాగిరెడ్డి ,తూము వేణు ,బ్లాక్ మహిళా అధ్యక్షురాళ్లు, డివిజన్ అధ్యక్షులు,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు,మహిళా కార్యకర్తలు, స్థానిక ప్రజలు భక్తులు, కాలనీవాసులు పాల్గొన్నారు.




# పిఆర్సీ వెంటనే అమలు చేయాలి

- ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

**తొర్రూరు, విశాలభారతి:**

పిఆర్సీని వెంటనే అమలు చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని నలంద పాఠశాలలో టీఎస్ యుటిఎఫ్ జిల్లా కోశాధికారి నాగ మల్లయ్య అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ పాల్గొన్నారు.ఈ సమావేశం లో నర్సిరెడ్డి మాట్లాడుతూ పిఆర్సీ గడువు జులై 2023 కే ముగిసినందున పిఆర్సీ నివేదిక తెప్పించుకొని ఉపాధ్యాయులకు, ఉద్యోగుల కు పిఆర్సీ ని వెంటనే అమలు చేయాలని కోరారు. విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ శాస్త్రీయంగా ఆలోచించి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధంగా రిపోర్ట్ ఇవ్వాలని, ఈ కుబేర్ లో ఉన్న పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని,గురుకులాల పాఠశాల సమయాన్ని శాస్త్రీయంగా రూపొందించాలని, కేజీబీవీ ఉపాధ్యాయునిలకు మినిమం టైమ్ స్కేల్ ఇవ్వాలని, సిపిఎస్ రద్దుపరిచి ఓల్డ్ పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు.జిల్లా అధ్యక్షులు మురళి కృష్ణ మాట్లాడుతూ నర్సిరెడ్డి తనను ఎమ్మెల్సీగా గెలిపించిన ఉపాధ్యాయుల కోసం నిబద్ధతతో నిజాయితీగా నిక్కచ్చిగా వ్యవహరించి ఉపాధ్యాయుల సమస్యల సాధనలో శక్తివంచన లేకుండా కృషి చేశారని,తిరిగి మార్చిలో జరగబోయే ఎన్నికలలో మళ్లీ ఎమ్మెల్సీగా నర్సిరెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతోనే ఉపాధ్యాయులు గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జనార్ధన చారి ,రమేష్, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు బిక్షపతి రిటైర్డ్ ఉపాధ్యాయులు నారాయణ మండలాల బాధ్యులు వెంకన్న, వెంకటేశ్వర్లు, రంజిత్, వంశీకృష్ణ, జనార్ధన్, పార్వతి, యాకయ్య, లింగరాజు, చైతన్య, జూనియర్ కాలేజ్ అధ్యాపకులు మల్లేశం అనిల్ సతీష్ రమేష్ శ్రీనివాస్ కేజీబీవీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందజేస్తాం

**పెద్ద అంబర్ పేట్, విశాలభారతి:**

పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ 5వ ప్రజాపాలన సభలో స్థానిక కౌన్సిలర్ బొర్ర అనురాధ సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ముఖ్యఅతిథులుగా చైర్ పర్సన్ పండుగల జయశ్రీ రాజు , వైస్ చైర్ పర్సన్ సంపూర్ణ విజయ్ శేఖర్ రెడ్డి , కమిషనర్ రవీందర్ రెడ్డి పాల్గొన్నారని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...చైర్ పర్సన్ వైస్ చైర్ పర్సన్ ,కమిషనర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికి గ్యారంటీ పథకాలు అమలు చేస్తున్నదని మహాలక్ష్మి గృహజ్యోతి గ్యాస్ సబ్సిడీ పథకాలను అమలు చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కింది. అంతేకాకుండా గ్రామ సభలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు,ఇల్లు లేని పేదవాడికి ఇందిరమ్మ ఇండ్లు ఎంపిక చేసి పథకాలను అందజేస్తామని తెలియజేశారు. ప్రతి పేదవాడికి ఇల్లు కట్టుకోవడానికి భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఇంటి స్థలాలు అందజేస్తామని సంక్షేమ పథకాలు అందజేసే బాధ్యత సంబంధిత అధికారులు బాధ్యతగా తీసుకోవాలని ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులను ఎంపిక చేయాలని అధికారులకు కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాల్ కమిషనర్ రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ చామ సంపూర్ణ విజయ్ శేఖర్ రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షులు కొత్తపల్లి జైపాల్ రెడ్డి, జిల్లా వైస్ ప్రెసిడెంట్ గజ్జి లక్ష్మ రెడ్డి,రెవిన్యూ అధికారులతో పాటు పలువురు మాజీ ప్రజాప్రతినిధులు, పెద్దలు మహిళా సోదరీమణులు కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.



# సేవలకు చిరునామాగా నిలుస్తున్న కౌటికే విఠల్

- ఉచిత భోజనం అందచేయడం కేవలం వినూత్నమైనదే కాదు పలువురి ఆకలి తీర్చే గొప్ప సేవ

**హైదరాబాద్ ,విశాలభారతి:**

తన పాలసీదారుల పుట్టినరోజులను వినూత్నంగా జరపడం భారతీయ జీవిత బీమా సంస్థ చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ కౌటికె విఠల్ కే ప్రత్యేకతగా నిలుస్తోంది. తన విలువైన పాలసీదారుడు అనంత్ నకరికంటి పుట్టినరోజు సందర్భంగా,కౌటికె విఠల్ బసవతారకం ఆసుపత్రి వద్ద వెయ్యి మందికి ఉచితపంక్తి భోజనం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి రోగుల కుటుంబ సభ్యులు,స్థానికంగా ఆకలితో ఉన్నవారికి ఆహార సేవలు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మదుపల్లి రవి గుప్తా హాజరై,రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ ఇప్పటివరకు వ్యాపారంలో ఖాతాదారులకు విలువనిచ్చే దృక్పథం చూశాం కానీ జీవిత బీమారంగంలో ఒక చీఫ్ లైఫ్ ఇన్సూరెన్స్ అడ్వైజర్ తన పాలసీదారుల పుట్టినరోజును ఇలా ప్రజలకు ఆహార దానం రూపంలో జరపడం ఎంతో వినూత్నమైన విషయం. ఇది వినటమే కాక, చూడడం కూడా చాలా స్ఫూర్తిదాయకం," అని అన్నారు. ఈ సందర్భంగా కౌటికె విఠల్ మాట్లాడుతూ,"అనంత్ తన ఆలోచనా శక్తితో చిన్న వయసులోనే గొప్ప వ్యాపారవేత్తగా ఎదిగారు. ఆయన యువతకు ఆదర్శప్రాయుడు,వారి వ్యాపార దృక్పథం ఎంతో ప్రత్యేకమైనది. జీవిత బీమా ఏజెంట్ గా ఆయన నన్ను ఎంచుకోవడం నా అదృష్టం," విఠల్ పేర్కొన్నారు. నా విలువైన ప్రతి పాలసీదారుడి పుట్టినరోజు ఇదే విధంగా వెయ్యి మందికి భోజనాలు అందించి, వారి ఆరోగ్య సుఖాలను కోరుతూ సేవలు అందించడమే నా లక్ష్యం అని, భోజనం చేసిన వారు వారి దీవెనలు తప్పకుండా అందిస్తారు," అని అన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
24.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com


## రోడ్డు భద్రత వారోత్సవాలు

**ఆర్మూర్, విశాల భారతి**

నందిపేట్ మండల కేంద్రంలో రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా నందిపేట్, డొంకేశ్వర్ మండలాల ఆటో డ్రైవర్లకు గురువారం ఎస్సై చిరంజీవి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి ఆటో డ్రైవర్ తన వాహనానికి సంబంధించిన సరైన పత్రాలు వెంట పెట్టుకోవాలని సూచించారు. ఆటో నడిపే డ్రైవర్లు నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపకుండ జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ఆటో డ్రైవర్లకు రోడ్డు భద్రత, సైబర్ నేరాల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నందిపేట్, డొంకేశ్వర్ మండల ఆటో యూనియన్ అధ్యక్షుడు ఖలీల్ ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



## జర్నలిజం సమాజానికి రక్షణ వలయం

- టిడిపి నాయకులు పోటు రంగా రావు

**మణుగూరు, విశాలభారతి:** మండలంలోని గురువారం స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో టిడిపి పార్లమెంట్ నాయకులు వాసిరెడ్డి చలపతిరావు అధ్యక్షతన నిర్వహించిన 'మణుగూరు ప్రెస్ క్లబ్ 2025' సభ్యులుగా నూతనంగా ఎన్నికైన అధ్యక్ష , కార్యదర్శి మరియు ట్రెజరర్ గా పిండిగా వెంకట్, మార్తి శ్రీనివాస్ మరియు సాబీర్ పాషా లను ఎంపికైన నూతన కమిటీకి తెలుగుదేశం పార్టీ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న టిఎన్టియుసి రాష్ట్ర నాయకులు పోటు రంగారావు మాట్లాడుతూ విలువలు కలిగిన జర్నలిజం తోనే సమాజం మనుగడ సాధిస్తుందని, మెరుగైన సమాజం కోసం పాత్రికేయులు నిరంతరం కృషి చేయాలని పత్రిక విలువలు వాటి విధానాలను నేటి సమాజానికి అందించి సమాచార విజ్ఞానాన్ని తెలుసుకొని పాత్రికేయులు మరింత ముందుకు కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నాణ్యమైన, విశ్వసనీయ సమాచారాన్ని అందించడంలో ప్రతి ఒక్క జర్నలిస్టు కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నేతలు వట్టం నారాయణ దొర, టిఎన్టియుసి నాయకులు గల నాగభూషణం, మాజీ సర్పంచ్ బచ్చల భారతి, మళ్లీడి లోకేష్, పూర్ణ, హరి, యార్లగడ్డ రాజా, మల్లంపటి రాజేశ్వరరావు, చావా రామారావు, బచ్చల సుమేష్, వాసు పొడుతూరు రవీందర్, మహిళా నేతలు ఎస్.కె కమురునిషా బేగం, చావా శ్రీదేవి, రమా తదితర పార్టీ నేతలు కార్యకర్తలు, జర్నలిస్టు సోదరులు పాల్గొన్నారు.







## మహిపాల్ రెడ్డి డౌన్ డౌన్, గో బ్యాక్, సేవ్ కాంగ్రెస్

- సీఎం ఫోటో పెట్టని ఎమ్మెల్యే మాకొద్దు..
- పటాన్ చెరులో మార్మోగిన నినాదాలు
- జాతీయ రహదారిపై బైఠాయించిన కాంగ్రెస్ శ్రేణులు
- క్యాంపు కార్యాలయంలో సిఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టిన కాంగ్రెస్ కార్యకర్తలు

**పటాన్ చెరు,విశాలభారతి** గూడెం మహిపాల్ రెడ్డి డౌన్ డౌన్.. గో బ్యాక్, గో బ్యాక్.. క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఫోటో పెట్టని ఎమ్మెల్యే మాకొద్దంటూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు చేపట్టిన నినాదాలు పటాన్ చెరులో మార్మోగాయి. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి వ్యతిరేకంగా గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆందోళనకు దిగారు. ఇటీవల బొల్లారం మున్సిపాలిటీలో జరిగిన సంఘటనను నిరసిస్తూ, నిఖార్సైన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి నిర్లక్ష్యం చేస్తున్నారని నిరసన చేపట్టారు. పటాన్ చెరు నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి కాంగ్రెస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలివచ్చి పటాన్ చెరు పట్టణ పరిధిలోని జాతీయ రహదారి పై బైఠాయించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. అసలు ఇంతకు ఆయన ఏ పార్టీలో ఉన్నాడో తేల్చాలని పట్టుబట్టారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి వ్యతిరేకంగా భారీ ఎత్తున నినాదాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులను పట్టించుకోకుండా బీఆర్ఎస్ పార్టీ నాయకులను ప్రాధాన్యతనిస్తూ, కాంగ్రెస్ కండువా వేసుకోకుండా, క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటో సైతం పెట్టని ఎమ్మెల్యేను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఎమ్మెల్యే మాకొద్దు.. వెంటనే అధిష్టానం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని కోరుతూ కాంగ్రెస్ శ్రేణులు నినదించారు.. నిరసన తెలిపారు.కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి దిష్టి బొమ్మను దగ్ధం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ శ్రేణులు పోలీసులు మధ్య వాగ్దానం జరిగింది. పోలీసులు కార్యకర్తలను అడ్డుకునే ప్రయత్నించినా వారు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి చేరుకుని గులాబీ కుర్చీలను ధ్వంసం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోతో ప్రదర్శన చేసి ఫోటో పెట్టేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో దూసుకెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. అయినప్పటికీ పలువురు కార్యకర్తలు లోపలికి వెళ్లి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఫోటోను పెట్టారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ ప్రజాపతినిధులు, నాయకులను నిర్లక్ష్యం చేస్తూ కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం సైతం ఇవ్వకుండా బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులతో కార్యక్రమాలు చేపడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన మహిపాల్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఫోటో ఎందుకు పెట్టడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల బొల్లారం మున్సిపాలిటీలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులపై దురుసగా వ్యవహరించారని విమర్శించారు. పనులు పూర్తికాక ముందే హడావుడి చేసి ప్రారంభోత్సవాలు చేశారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉంటూ పార్టీ అసలైన నాయకులు, కార్యకర్తలను ఇబ్బంది పెడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు.



## బండారు మల్లయ్య చిత్రపటానికి నివాళులు

- కాంగ్రెస్ మండల అధ్యక్షులు కందాల సమరం రెడ్డి

**శాలిగౌరారం, విశాలభారతి:** ఉప్పలంచ మాజీ సర్పంచ్ బండారు మల్లయ్య మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మండల కాంగ్రెస్ అధ్యక్షులు కందాల సమరం రెడ్డి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్ రెడ్డి అన్నారు.శాలిగౌరారం మండల కేంద్రంలో బండారు మల్లయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మల్లయ్య ను హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హత్య రాజకీయాలను ఖండించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చామల మహేందర్ రెడ్డి, బండ పల్లి కొమురయ్య, గూని వెంకటయ్య, నరిగే నరసింహ, బోడ అరుణ్ కుమార్, చింత ధనంజయ, తీర్పాటి మల్లయ్య, బెల్లి వీరభద్రం,ఐలయ్య, వడ్లకొండ పరమేష్,వేముల గోపీనాథ్, బొల్లికొండ గణేష్, మాదగోని అంజయ్య, తోటకూరి పరుశురాం,లోడంగి మహేష్, వేముల సాయి కుమార్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల కొరకు నిదుల మంజూరు చేయండి

- జిహెచ్ఎంసి మేయర్ ని కలిసిన కార్పొరేటర్లు



**కాప్రా, విశాలభారతి:** మల్లాపూర్ డివిజన్ పరధిలోని ఓల్డ్ మల్లాపూర్ మరియు పలు కాలనీలల్లోని అంతర్గత రోడ్లు చాలా దారుణంగా ఉన్నాయని వాటికి తగిన నిధులు కేటాయించి రోడ్ల కొరకు నిధులు కేటాయించాలని జిహెచ్ఎంసి మేయర్ విజయలక్ష్మిని, మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి,హెచ్ బి కాలనీ కార్పొరేటర్ ప్రభుదాస్ లు కల్సి వినతిపత్రం అందజేశారు. గతంలో చాలా సంవత్సరాల క్రితం వేసిన రోడ్లు చాలా అధ్వాన స్థితిలో ఉన్నాయని కావున ఈ సమస్యకు పరిష్కారంగా సుమారు నాలుగు కోట్ల రూపాయల నిధులను సిసి రోడ్ల అభివృద్ధి పనులకు మంజూరు చేసి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.




## శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

**రామగుండం, విశాలభారతి:** రామగుండం మండలంలోని ఎన్.టి.పి.సి టౌన్షిప్ లో గల శ్రీ చైతన్య హై స్కూల్ లో ఆరు నుండి పదవ తరగతి విద్యార్థులు క్యాట్ లెవెల్ 2 పరీక్షల నందు మొత్తం 78 మంది విద్యార్థులు విజయం సాధించారు. ఇందులో 11 మంది విద్యార్థులు 1000 రూపాయల ప్రైజ్ మనీ, 38 విద్యార్థులు మెడల్స్ మరియు సర్టిఫికెట్లు, 29 మంది విద్యార్థులు సర్టిఫికెట్లు గెలుచుకోవడం జరిగింది. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులను మరియు వారికి ప్రోత్సాహాన్ని అందించినటువంటి ఉపాధ్యాయులను ఏ.జీఎం తిరుపాలు,కోఆర్డినేటర్ జయకుమార్, పాఠశాల ప్రిన్సిపల్ ఉదయ్ కుమార్అభినందించారు.ఈ ఫలితాల పట్ల వైస్ ప్రిన్సిపల్ నమ్రత, డీన్ అనిల్ కుమార్, క్యాంపస్ ఇంచార్జ్ నరేంద్ర కుమార్ మరియు అధ్యాపక బృందం ఆనందం వ్యక్తం చేశారు.



## ప్రజా సమస్యలను పరిష్కరించాలి

- జిహెచ్ఎంసి కమిషనర్ కు వినతిపత్రం
- బీఆర్ఎస్ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

**కూకట్ పల్లి,విశాలభారతి:** హైదరాబాద్ నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తిని బీఆర్ఎస్ పార్టీ నగర మాజీ మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్, సబితా ఇంద్రారెడ్డి, ఎంఎల్ఏ మాధవరం కృష్ణారావు, వివేకానంద,రాజశేఖర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, గోపీనాథ్, కాలేరు వెంకటేష్, ముఠా గోపాల్,శంభీపూర్ రాజు లు కలిశారు. హైదరాబాదులో ప్రజలు ఎదుర్కొంటున్న శానిటేషన్,వీధి దీపాలు,రోడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కూడా జిహెచ్ఎంసి అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై వారు ప్రశ్నించారు.గత ప్రభుత్వం మంజూరు చేసిన పనులను కొంతమేర పూర్తి చేసిన పనులను కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులు శంకుస్థాపన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించకపోవడం పై పిర్యాదు చేశారు. ప్రజా ఎదుర్కొంటున్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లిందుకు ఎన్ని సార్లు ఫోన్ చేసినా కమిషనర్ స్పందించలేదని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్లు,రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాల అర్హుల జాబితా తయారీలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. అక్రమాలకు తావులేకుండా జిహెచ్ఎంసి ఆధ్వర్యంలో క్షేత్ర స్థాయిలో పరిశీలించి నిజమైన అర్హులను గుర్తించి వారికి అందజేయాలని కోరారు. అనంతరం కూకట్పల్లి నియోజకవర్గం లో నెలకొన్న సమస్యలు పెండింగ్ పనులపై ఇప్పటికే పలుమార్లు విన్నవించినా పరిష్కారానికి నోచుకోలేదనీ వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరించాలంటూ ఎంఎల్ఏ మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో అన్ని డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి వినతి పత్రాలను అందజేశారు.



## హామీల అమలులో ప్రభుత్వం విఫలం

**ఆమనగల్లు,విశాలభారతి :** రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని జాతీయ మాజీ బీసీ కమిషన్ సభ్యులు తల్లోజు ఆచారి ఆరోపించారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు చంద్రయన్ పల్లి తండా, 7వ వార్డు వెంకటేశ్వర కాలనీ, 14వ వార్డు అంబేద్కర్ కాలనీ, 15వ వార్డు శివాలయం కాలనీలలో సిసి రోడ్డు పనులకు మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, ఆయా వార్డుల కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆచారి పాల్గొన్ని మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందని, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు కండె హరిప్రసాద్, కౌన్సిలర్లు కృష్ణ నాయక్, విజయ్ కృష్ణ, చెన్నకేశవులు, చేక్కాల లక్ష్మణ్, కృష్ణ యాదవ్, గోరటి జ్యోతి నరసింహ, మండల అధ్యక్షుడు శ్రీను కేకే, పట్టణ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, మొక్కల వెంకటయ్య శేఖర్ మహేష్ విష్ణు శ్రీధర్ పాల్గొన్నారు.



## రహదారి భద్రతపై అందరికీ అవగాహన అవసరం

- కూకట్పల్లి బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

**కూకట్ పల్లి,విశాలభారతి:** ఆర్టిఏ కూకట్పల్లి యూనిట్ కార్యాలయం అధికారులు ట్రాఫిక్ పోలీసులు పాఠశాల విద్యార్థులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు.కెపిహెచ్బి నాలుగో రోడ్ లోని గ్లోబల్ ఎడ్జ్ పాఠశాలలో గురువారం జాతీయ రహదారి భద్రత మాచోత్సవాల పేరిట విద్యార్థులకు ఎంవీఐ శ్రీనుబాబు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు .ఈ కార్యక్రమంలో భాగంగా కూకట్ పల్లి ఆర్టిఏ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాటలడుదుతూ ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ రూల్స్ పాటిస్తూ ప్రమాదరహిత సమాజాన్ని నిర్మించటానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు .ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు,ట్రాఫిక్ ఎస్ఐ మాధవరెడ్డి పాల్గొన్నారు.

## హాజ్రత్ షా ఖలందర్ బాబా దర్గా ఉరుసు ఉత్సవాలు

**ఆమనగల్లు, విశాల భారతి :** తలకొండపల్లి మండలం వెల్జాల గ్రామంలో హాజ్రత్ మౌలాలి షా ఖలందర్ బాబా దర్గా షరీఫ్ 35వ ఉర్సు ఉత్సవాలను ఈనెల 27నుండి 29వరకు నిర్వహిస్తున్నట్లు దర్గా ముత్తవల్లి జనాబ్ మహమ్మద్ అబ్దుల్ నయిమ్ షా ఖాద్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉరుసు మహోత్సవ సందర్భంగా ఉత్సవ విశేషాల గోడపత్రాన్ని విడుదల చేశారు. ఈ ఉర్సు కార్యక్రమంలో వివిధ మండలాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొంటారని, వచ్చే భక్తులకు అన్నీ ఏర్పాట్లను చేశామన్నారు. ఈనెల 27న గంధోత్సవం, 28న దీపారాధన, ఖవాలీ, 29న ఖత్మే ఖురాన్, అన్నదాన కార్యక్రమం గంధోత్సవము సాయంత్రం 5 గం"కు బయలుదేరి ఊరు విధుల నుండి తిరుగుతు రాత్రి 9:00 గ.లకు దర్గా వద్దకు చేరుతుందని, అనంతరం దర్గాపై గంధోం సమర్పణ ఫాతిహ చాదర్ సలాం పువ్వులు సమర్పంచబడునని కావున భక్తులందరు అదిక సంఖ్యలో పాల్గోని విజయవంతం చేయలని కోరారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
24.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com



vishalabharathi Telugu Daily

## భాదితుని మొబైల్ ఫోన్ అప్పగింత

**ఆమనగల్లు, విశాల భారతి :**
తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన కుమార్ అనే వ్యక్తి తన 40, 000 రూపాయల విలువ గల వన్ ప్లస్ మొబైల్ ఫోన్ ని ఆమనగల్ పట్టణంలో పోగొట్టుకున్నాడు. దాంతో అతడు వెంటనే ఆమనగల్ పోలీస్ స్టేషన్ లో ఎస్ఐ వెంకటేష్ ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన వారు సెయిర్ పోర్టల్ నందు వివరాలు నమోదు అట్టి ఫోన్ ని ట్రేస్ చేశారు. బాధితుడు కుమార్ కు ఎస్ఐ వెంకటేష్ ఫోన్ ని అందజేశారు. దీంతో బాధితుడు కుమార్ మాట్లాడుతూ తన నలభైవేల రూపాయల విలువైన ఫోన్ ని కనుగొని తనకు అప్పగించినందుకు పోలీసువారికి ధన్యవాదాలు తెలిపాడు.





## శిఖండి రాజకీయాలు మానుకో..

- ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత దాడులకు తావులేదు..
- రెండు సార్లు ప్రజలు చీకొట్టిన బుద్ధి రాలేదా కాట
- పటాన్ చెరు ప్రజల అభివృద్ధి నా ప్రధాన ఎజెండా
- కాంగ్రెస్ పార్టీ ప్రతిష్ఠ, బలోపేతం చేసేందుకే మా ప్రణాళికలు
- తీరు మార్చుకోకుంటే తీవ్ర పరిణామాలు
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు,విశాలభారతి**

ప్రజలు రెండుసార్లు చీకొట్టిన.. బుద్ధి మారకుండా తిరిగి నియోజకవర్గంలో శిఖండి రాజకీయాలు చేస్తూ వ్యక్తిగత దాడులకు పాల్పడడం మానుకోకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి కాట శ్రీనివాస్ గౌడ్ కు హెచ్చరించారు. గురువారం పటాన్ చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయం పై దాడి ఘటనను నిరసిస్తూ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యే నివాసం ఉండే క్యాంపు కార్యాలయం పై కార్యకర్తలను రెచ్చగొట్టి దాడులకు దిగడం ప్రజాస్వామ్యానికి పెను ప్రమాదం లాంటిదన్నారు. పటాన్ చెరు నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మూడుసార్లు గెలిచి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా ప్రజల హృదయాలను గెలుచుకోవడం జరిగిందని తెలిపారు. కాట శ్రీనివాస్ గౌడ్ కి అమీన్ పూర్ సర్పంచ్ గా ప్రజలు అవకాశం అందిస్తే నిధులు పక్క దారి పట్టించి జైలు పాలు కావడంతో పాటు.. రెండుసార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి దారుణ ఓటమికి గురైన వ్యక్తులు నేడు తనపై వ్యాఖ్యలు చేయడం సిగ్గుగా ఉందన్నారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఇలాంటి నీచ రాజకీయాలను చూడలేదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలలో ప్రోటోకాల్ ప్రకారం మాత్రమే ఆహ్వానాలు అందజేశారు తప్ప.. పార్టీలకు అనుగుణంగా నిర్వహించడం జరుగుతుందా అని ప్రశ్నించారు. తమ కార్యకర్తలు ప్రతిఘటిస్తే పరిస్థితులు ఎలా ఉండేవని ప్రశ్నించారు. తన కార్యకర్తలు తమ మీద ఒత్తిడి చేసిన నేను వాళ్ళను కంట్రోల్ చేసుకుంటూ అక్కడికి ఎవరిని రాకుండా ఎలాంటి హింస వాతావరణం చోటు చేసుకోకుండా నియంత్రించానని వెల్లడించారు. ఇలాంటి దాడుల సంస్కృతి పటాన్ చెరు ప్రాంతంలో ఇప్పటి వరకు లేదని తమ ఓపికను పరీక్షిస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృత్తం చేస్తే చూస్తూ ఊరుకోబోమని అందుకు తగ్గ మూల్యం చెల్లిస్తామని తీవ్రంగా రియాక్టయ్యారు. క్యాంపు ఆఫీసు పై దాడి చేసిన దుండగులపై పోలీసులు కఠినంగా వ్యవహరించాలని వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని పోలీసులను డిమాండ్ చేశారు. ఈ ఘటన పై ఇప్పటికే ఐజి సత్యనారాయణ దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి సైతం ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థి భవిష్యత్ కి పదవ తరగతి ఫలితాలే పునాది

- జ్ఞానాన్ని పెంపొందించుకొని ప్రయోజకులు కావాలి.
- పాఠశాలలో అసౌకర్యాలపై ఆగ్రహం వ్యక్తం చేసిన కలెక్టర్
- తేజస్ నందాలాల్ పవార్

**సూర్యాపేట, విశాలభారతి**



విద్యార్థి భవిష్యత్ కి పదవ తరగతి ఫలితాలే పునాది అని జిల్లా కలెక్టర్ తేజస్ నందులాల్ పవర్ అన్నారు.గురువారం మధ్యాహ్నం సూర్యాపేట జిల్లాలోని చివ్వేంల మండలం చందుపట్ల బి గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ ప్రాథమిక పాఠశాల లను ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా పాఠశాలల్లోని స్టాఫ్ రూమును పరిశీలించారు.అనంతరం పాఠశాల లోని తరగతి గదులను సందర్శించారు. పదవ తరగతి గదిలో జరుగుతున్న తెలుగు క్లాస్ ని సందర్శించి విద్యార్థులతో కొత్త బాట అనే 4 వ పాఠాన్ని దివ్యశ్రీ, నవీన్ చేత చదివించారు. అనంతరం విద్యార్థులు రాసిన నోట్ పుస్తకాలను వారి చేతిరాతను పరిశీలించి పరీక్షలలో హ్యాండ్ రైటింగ్ మంచిగా వ్రాసేలా చూసుకోవాలని సూచించారు. పదవ తరగతి వార్షిక పరీక్షలకు ఇంకాముప్పై రోజులు సమయం మాత్రమే ఉన్నందున బాగా కష్టపడి చదవాలని, మంచి మార్కులు తెచ్చుకొని పాఠశాలకి మంచి పేరు తేవాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల పనులు జరగకపోవటం పై ప్రధాన ఉపాధ్యాయుడు బి. శ్రీనివాస్ ని, సంబంధిత ఇంజనీరింగ్ అధికారిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజులలో పనులు పూర్తి చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటానని ఆదేశించారు.తదుపరి స్టోర్ రూమ్ ని, మెను రిజిస్టర్, హాజరు పట్టికను పరిశీలించారు, పిల్లల కొరకు తయారుచేసిన మధ్యాహ్న భోజనం పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేస్తు విద్యార్థులతో ముచ్చటించారు. సోమ, బుధ, శుక్రవారం లలో గుడ్లు పెడుతున్నారా అని అలాగే మెను ప్రకారం రోజువారీ కూరలు చేస్తున్నారా లేదా అని విద్యార్థులని అడిగి తెలుసుకున్నారు.తదుపరి పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి పదవ తరగతి పరీక్షలలో నూరు శాతం సాధించాలని అందుకొరకు ఉదయం, సాయంత్రం స్టడీ అవర్స్ ఏర్పాటు చేయాలని, విద్యార్థులు ఏదైనా సబ్జెక్ట్ లో వెనకబడి ఉంటే ప్రత్యేక తరగతులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమం లో తహసీల్దార్ కృష్ణయ్య,ప్రధానోపాధ్యాయులు బి.శ్రీనివాస్,ఉపాధ్యాయని ఉపాధ్యాయులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే నారాయణరెడ్డి
- రేషన్ కార్డు కోసం దరఖాస్తు అందజేస్తున్న విటాయిపల్లి గ్రామస్తులు

**ఆమనగల్లు, విశాలభారతి :**

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందుతాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. గురువారం మున్సిపాలిటీలోని విటాయిపల్లి గ్రామంలో ప్రజా పాలన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్లు ఆత్మీయ భరోసా రైతు భరోసా పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి అందజేస్తుందన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వెంచర్లకు, గుట్టలకు, రాళ్ళకు, రప్పలకు, వ్యవసాయానికి యోగ్యం కానీ భూములకు రైతు భరోసా ఇచ్చి ప్రజాధనం వృధా చేసిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయానికి యోగ్యమైన భూములను గుర్తించి రైతు భరోసా అందజేస్తుందన్నారు. పథకాల జాబితాలో పేర్లు రాకుంటే నిరాశ చెద్దొద్దని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని చెప్పారు. ప్రతి ఒక్కరు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, మార్కెట్ చైర్మన్ యాట గీతా, వైస్ చైర్మన్ దుర్గయ్య, కౌన్సిలర్ సుజాత రాములు, టిపిసిసి సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్,, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జగన్ పట్టణ అధ్యక్షులు మానేయ, మాజీ సర్పంచ్ పర్వతాలు, గ్రామస్తులు పెరుమాళ్ళవెంకటరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి వెంకటేశ్వర రెడ్డి లక్ష్మారెడ్డి జగన్ రెడ్డి శంకర్ రవీందర్ శ్రీధర్ తిరుమలేష్ లింగం కృష్ణ యాదిరెడ్డి, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు



## గ్రంధాలయంలో మధ్యాహ్న భోజన ఏర్పాటు

- పేట గ్రంధాలయంలో రూ. 5 భోజనం ప్రారంభించిన చైర్మన్ వంగవీటి రామారావు

**సూర్యాపేట, విశాల భారతి**

గ్రంధాలయంలో ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగుల సౌకర్యార్థమే జిల్లా కేంద్రంలోని గ్రంధాలయంలో హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ పౌండేషన్ సహకారంతో అన్న పూర్ణ రూ. 5 మధ్యాహ్నం బోజనాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ వంగవీటి రామారావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని గ్రంధాలయంలో రూ.5తో అందించనున్న మధ్యాహ్న భోజనాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగుల సమయం వృదా కాకుండా ఉండేందుకు మధ్యాహ్న భోజనాన్ని గ్రంధాలయంలో తక్కువ ధరలో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బాగా చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించి జిల్లాకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గ్రంధాలయ కార్యదర్శి బాలమ్మ, శ్రావన్ కుమార్, లైబ్రేరియన్లు శ్యాంసుంధర్ రెడ్డి, కె. విజయ బాస్కర్, సృజన, హరేకృష్ణ మూమెంట్ చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు, గ్రంధాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## విద్యార్థులు కష్టపడి చదువుకోవాలి

**ఆమనగల్లు, విశాల భారతి :**

విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించి, ఉన్నతమైన స్థానాలలో నిలబెట్టడానికి ప్రతి ఒక్కరు కష్టపడి పనిచేయాలని కడ్తాల్ మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి అన్నారు. గురువారం కడ్తాల్ గిరిజన బాలుర ఆశ్రమ వసతి పాఠశాలకు పరేడ్ బ్యాండ్, మైక్ సెట్ అందజేశారు. అదేవిధంగా పాఠశాల ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న కామన్ డైట్ ద్వారా విద్యార్థులకు భోజన ఏర్పాటులో సమయపాలన పాటించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు మెరుగైన విద్యతోపాటు, అనేక సౌకర్యాలు కల్పించారని అన్నారు. ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్ లో ప్రతిభ కలిగిన విద్యార్థులు ఎంతోమంది ఉన్నారని వారందరికీ రాజకీయాల కతీతంగా అందరం నమ్మకం, ఆత్మవిశ్వాసం కలిగించాలని కోరారు. మాజీ సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభ్యాసం, వసతుల ఏర్పాటులో రాజకీయాలకు తావివ్వకుండా ప్రతి ఒక్కరూ తోడ్పాటునందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ రాములు, అధ్యాపకులు భీమ్లా నాయక్, యాదయ్య, దేవానంద్, పి.మంజుల,ఆర్. మంజుల,అమృత,సాయిలు మాజీ వార్డు సభ్యులు గురిగళ్ళ జంగమ్మ రామచంద్రయ్య, మూడ అశోక్, గండికోట చంద్రశేఖర్,గుర్క కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలి

- అర్హులకు సంక్షేమ పథకాలు అందించేందుకే వార్డు సభలు
- 31 వ వార్డు సభలో అదనపు కలెక్టర్ పి రాంబాబు

**సూర్యాపేట, విశాల భారతి**

అర్హులైన నిరుపేదలు ప్రతి ఒక్కరూ ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూర్యాపేట జిల్లా అదనపు కలెక్టర్ పి. రాంబాబు అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేసే క్రమంలో జిల్లా కేంద్రంలోని 31వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అధికారులు చదివిన జాబితాలో పేర్లు లేని వారు మరల దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. ఈ దరఖాస్తుల ప్రక్రియ ఒక్క రోజుతో ఆగదని నిరంతరం కొనసాగుతుందని అందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. వార్డు కౌన్సిలర్ కొండపల్లి నిఖిల దిలీప్ రెడ్డి మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. వార్డులో నిజమైన అర్హులను గుర్తించే అందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానన్నారు. జాబితాలో పేర్లు లేని వారు మరల దరఖాస్తులు చేసుకుంటే అధికారులు పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కొండపల్లి దిలీప్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు జావీద్,వార్డు అభివృద్ధి అధికారిని కవిత,జ్యోతుల శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.




## ఏబిఏపి ఆధ్వర్యంలో అల్పాహారం వితరణ

**సూర్యాపేట, విశాల భారతి**

అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ సూర్యాపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణం లోని ఏరియా ఆసుపత్రిలో గురువారం అల్పాహారం పంపిణి చేశారు. పతంజలి ఆయిల్ పామ్ కంపెనీ జిల్లా జూనియర్ మేనేజర్ వి.శశి కుమార్ పుట్టినరోజు సందర్భంగా వారి సహకారంతో ఇట్టి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబిఏపి జిల్లా అధ్యక్షులు రంగు ముత్యంరాజు మాట్లాడుతూ అన్ని దానాలకన్నా అన్నదానం మిన్న అని అన్నారు. అన్నదానం చేయడం మూలంగా అన్నపూర్ణ దేవి,అన్నదాన ప్రభువు అయినా అయ్యప్ప స్వామి అనుగ్రహం లభిస్తుందని అన్నారు. పుట్టినరోజు న, పెళ్లిరోజున సమాజంలోని ప్రతి ఒక్కరు సేవా భావనతో పనిచేయాలని, నిరాశ్రయులను చేరా దీసి మనకు తోచిన సహాయం చేయాలనీ అప్పుడే భగవంతుడి అనుగ్రహం లభిస్తుందన్నారు. అయ్యప్ప స్వామి భక్తులు గాని ఇతరులు ఎవరైనా ఇట్టి కార్యక్రమంలో భాగస్వామ్యం కావచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారతీయ అయ్యప్ప ధర్మాప్రచార సభ జిల్లా కోశాధికారి మాశెట్టి నరేష్, జిల్లా కమిటీ సభ్యులు , తన్నీరు వాసుదేవు, మొరిశెట్టి సత్యనారాయణ,బొబ్బిలి వినాయక, గంధసిరి భద్రాచలం, యానాల సుధాకర్ రెడ్డి, రంగు స్వాతి తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలను మభ్యపెట్టడానికి గ్రామసభలు

**ఎల్కతుర్తి, విశాలభారతి**

ఎల్కతుర్తి లోని మండల తాజా మాజీ సర్పంచుల బిల్లులు చెల్లించక పోగా గ్రామ సభలు అని చెప్తూతూ ప్రజలతో చెలగాట మాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్నికల వాగ్దానాలు ఏ ఒక్కటి కూడా 100% పూర్తి చేయలేదని తాజా మాజీ సర్పంచ్ అంతా ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో ఇప్పటివరకు సర్పంచ్ లేకుండా గ్రామసభలు ఏంటి అని వాపోయారు. అధికారులను ఇబ్బంది పెడుతూ గ్రామసభలను తిప్పుతూ ప్రజలను మోసగిస్తున్న ప్రభుత్వం తాజా మాజీ సర్పంచ్ ఫోరం అధ్యక్షులు బూరుగుల రామారావు సాంబమూర్తి రాజు నిరంజన్ రెడ్డి దేవేందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక
శుక్రవారం,
24.01.2025
హైదరాబాద్
epaper:vishalabharati.com
www.vishalabharati.com





# బడి బయట పిల్లల గుర్తింపు సర్వే

- బడి పిల్లలను బడిలో చేర్పించాలి
- పనిలో పెడితే చట్టరీత్య చర్యలు
- ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు

మునుగోడు విశాల భారతి

మునుగోడు మండలంలో వివిధ గ్రామాల్లో బడి బయట ఉండే పిల్లల గుర్తింపు కోసం విద్యాశాఖ ఆదేశాల మేరకు సీఆర్పీలు సర్వే నిర్వహిస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో 6 నుండి 14 సంవత్సరాలు, 15 నుండి 19 ఏళ్లలోపు వారు చదువు కోకపోవడానికి కారణాలను గుర్తిస్తూ సర్వే చేస్తున్నారు. బడి బయట ఉన్న పిల్లలను గుర్తించేందుకు 33 అంశాలతో కూడిన సర్వే పత్రాలను తీసుకొని సిఆర్పిలు, ఐఆర్పిలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఈనెల 10 నుంచి మొదలైన సర్వే ఈనెల 25 వరకు కొనసాగుతుంది. ఈ సర్వేలో సిఆర్పిలు బడీడు వయసు ఉండి బడిలో చేరని వారిని గుర్తించడం, పాఠశాలల్లో చేరి 30 రోజులు గైహాజరైనటువంటి వారిని గుర్తించి విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించి మళ్లీ పాఠశాలలో చేర్పించడం పై ప్రత్యేక దృష్టి సారించారు. క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు విద్యార్థి ఆధార్ సంఖ్య, చిరునామా, మాతృభాష చదువుకు దూరం కావడానికి గల కారణాలు సర్వే పత్రంలో నమోదు చేస్తున్నారు. సర్వే పత్రంలో అన్ని రకాల అంశాలను నమోదు చేస్తున్నారు. ఈ సర్వేలో ఇతర జిల్లాల నుంచి ఇతర రాష్ట్రల నుండి వలస వచ్చి కోళ్ల ఫారాలు, ఇటిక బట్టిల, బొగ్గు బట్టిలు మరియు షాప్ లలో కూలీలుగా వచ్చే కుటుంబాలు ఎక్కువగా ఉండే చోట వారి పిల్లలను గుర్తించి వాటి యజమానులకు విద్యార్థి బడికి హాజరు అయ్యేలా కౌన్సిలింగ్ ఇస్తున్నారు. బడి బయట పిల్లలతో పాటుగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలను గుర్తించేందుకు కార్యచరణ సిద్ధం చేశారు. వ్యక్తిగతంగా పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆరా తీస్తున్నారు. ఆర్థిక స్థితిగతులు, కుటుంబ నేపథ్యం తదితర వివరాలను నివేదికలో పొందుపరచనున్నారు. పాఠశాల విద్యతో పాటు ఇంటర్ చదువులకుదూరంగా ఉన్న వారిని సర్వేలో గుర్తిస్తారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను అంచనా వేయడానికి వివిధ కోణాల్లో వివరాలు సేకరిస్తున్నారు. ఎవరైనా బడి ఈడు పిల్లలును పనిలో పెట్టుకున్నట్లు అయితే వారి పైన విద్యాశాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు కఠిన చర్యలు ఉంటాయి. ప్రభుత్వం విద్యార్థులకు అందించే ఉచిత పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్నభోజనం, రవాణా భత్యం వంటి అంశాలు వివరిస్తున్నారు. ఇప్పటి వరకు మండల వ్యాప్తంగా చొల్లేడు 1, కొంపల్లి 4, చీకటి మామిడి 2, మునుగోడు 4, రత్తిపల్లి 3 మొత్తం 14 మంది బడిబయటి పిల్లలను గుర్తించారు. ఈ కార్యక్రమంలో సిఆర్పిలు జీడిమడ్ల సైదులు, పందుల నర్సింహ, ఐతగోని సతీష్, చందపాక నాగరాజు, ఐఈఆర్పి ఇడెం ఇందిరా పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే పద్మరావు గౌడ్ కు పరామర్శ



దేవరుప్పుల, విశాల భారతి

మాజీ మంత్రి, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుల్ల పద్మారావు గౌడ్ ఉత్తరాఖండ్ పర్యటనకు వెళ్లి అస్వస్థతకు గురై చికిత్స అనంతరం హైదరాబాద్ లోని వారి నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న విషయాన్ని తెలుసుకొని మాజీ మంత్రి, పాలకుర్తి నియోజక వర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ ఎర్రబెల్లి దయాకర్ రావు గురువారం వారి ఇంటికి వెళ్ళి వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట జనగామ జిల్లా బిఆర్ఎస్ నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్, డాక్టర్ రఘు, తదితరులున్నారు.

# సింగరాజుపల్లి గ్రామ సభలో దరఖాస్తుల స్వీకరణ

అర్హుల జాబితా గ్రామసభల్లో ప్రదర్శన

దేవరుప్పుల, విశాల భారతి




దేవరుప్పుల మండలంలో గ్రామంలోని గ్రామ సభలు ఆయా గ్రామ పంచాయతీలలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం సింగరాజు పల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి, మధుకర్ అధ్యక్షతనలో మండల అధికారులు నిర్వర్తించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన 6 గ్యారంటీలలో భాగంగా రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్ల కొరకు ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారి అర్హుల జాబితా ప్రకటించారు. అర్హత కలిగి ఉండి లిస్టులలో పేరు రానివారు మరల దరఖాస్తు చేసుకోవాలని అధికారులు లబ్ధిదారులకు గ్రామ సభలో సూచించారు. ఇట్టి కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ గ్రామ ప్రజలు అధిక సంఖ్య పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మైపాల్ రెడ్డి మాట్లాడుతూ, జనవరి 26 నుండి ప్రభుత్వం లాంఛనంగా ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. కుల గణన ప్రభుత్వం వద్ద ఉన్న కుటుంబాల సమాచారం ఆధారంగా లబ్ధిదారుల తాత్కాలిక జాబితా సిద్ధం చేశారు. నాలుగు పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను గ్రామసభలో ప్రజల ముందు వెల్లడిస్తున్నాము,సాగుకు యోగ్యం కానీ భూమికి రైతు భరోసా ఇవ్వడం లేదు అన్నారు. అర్హత కలిగి ఉండి దరఖాస్తులు చేసుకోవాలనుకునేవారు దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ జరుగుతుందని, ఈ సందర్భంగా గ్రామ సభ ద్వారా ప్రజలకు తెలియజేశారు. లిస్టులో పేర్లు ఉన్నవారే కాకుండా జాబితాలో పేర్లు రానివారు తర్వాత దరఖాస్తులను స్వీకరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ సాయికిరణ్, ఎస్ఐ ఊరు సుజన్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ ఏ శ్రీధర్, ఎలక్ట్రికల్ ఏఈ నరసింహులు, హెల్త్ డిపార్ట్మెంట్ సృజన, ఎమ్ఎల్ఎచ్ పి జెసిక, కవిత, శారద, వివోఏలు స్వామి, మహేశ్వరి, అంగన్వాడి ఉపాధ్యాయులు మంగ, రేణుక, శ్రీలత, ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణంరాజు, కరోబార్ వారాల సోమరాజు, గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామ పెద్దలు నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# చీకటి తోవ్వల్లో వెలుగులు నింపిన ప్రభాకరుడు

- మనమందరం ప్రభాకరులం కావాలి
- ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి
- కుల రహిత సమాజం కోసం పాటుపడిన వ్యక్తి
- ప్రభాకర్ సంస్మరణ సభలో ఎమ్మెల్సీ కోదండరాం

విశాలభారతి, భీమదేవరపల్లి

మండలంలోని ధర్మారం గ్రామంలో నిర్వహిస్తున్న తెలంగాణ ఉద్యమకారుడు చెప్యాల ప్రభాకర్ సంస్మరణ సభకు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ కోదండరాం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమ సమాజం కోసం బతికిన వ్యక్తి ప్రభాకర్ అని కొనియాడారు. ప్రభాకర్ రాజకీయ తోవ్వలోకి వెళ్లకుండా, ప్రజా తోవ్వలకు రావడం గమనించదగ్గ విషయమని, విద్యావంతుల వేదిక, జేఏసీ నిర్మాణంలో కీలకపాత్ర వహించిన వ్యక్తి ప్రభాకర్ అని అన్నారు. ముఖ్యంగా అంబేద్కర్ సిద్ధాంతాలకు లోబడి కులరహిత సమాజానికి పూనుకున్నాడని అన్నారు. ప్రభాకర్ ఆలోచన విధానాలను, నమ్మిన సిద్ధాంతాలను పుస్తక రూపంలో తీసుకురావడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమానికి డేగల సారయ్య, ఏరుకొండ నరసింహస్వామి పూనుకోవాలని సూచించారు. అలాగే ప్రతి సంవత్సరం ప్రభాకర్ జయంతి జరుపుకుంటూ ఆయన యొక్క సిద్ధాంతాలను, ఆలోచన ధోరణిపై సమావేశాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అంతకుముందు ప్రభాకర్ కుటుంబ సభ్యులతో కలిసి జ్యోతి ప్రభాకర్ ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కవ్వ లక్ష్మారెడ్డి, మాజీ జెడ్పి చైర్మన్ డాక్టర్ సుధీర్ కుమార్, మాజీ జెడ్పిటిసి వంగ రవీందర్, చెప్యాల ప్రకాష్, జగన్, ఎదులాపురం తిరుపతి, మాట్ల వెంకటస్వామి, ఉప్పుల కుమారస్వామి, కండె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పొన్నం హామీతో అన్నదాతల్లో ఆనందం

- రుణమాఫీపై కీలక ప్రకటన
- మార్చిలో అర్హులందరికీ రుణమాఫీ చేస్తాం

విశాలభారతి, భీమదేవరపల్లి



మండలంలోని పలు గ్రామాల్లో రైతులు గ్రామసభలలో రెండు లక్షల రుణమాఫీ పై అధికారులను విరదీస్తూ ఆందోళనలు చేపట్టారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ గ్రామసభలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కీలక ప్రకటన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు రుణమాఫీ కానీ రైతులకు మార్చిలో షెడ్యూల్ ప్రకటించి వారికి కూడా రుణమాఫీ చేస్తామని స్పష్టం చేశారు. ముల్కనూర్ గ్రామసభలో రుణమాఫీపై రైతులు ఆందోళన చేసిన వార్తను విశాలభారతి తెలుగు దినపత్రికలో ప్రచురించిన విషయం విధితమే. మరుసటి రోజే మంత్రి స్పందించి కీలక ప్రకటన చేయడాన్ని రైతులు హర్షించారు.

# తరాలపల్లి చిన్నోడా ! నీవు తరతరాలు వర్ధిల్లాలి

- ఆధ్యాత్మిక చింతనతో మొక్కు తీర్చుకున్న బుడతడు
- ఆశీర్వదించిన ఆలయ అర్చకులు

విశాలభారతి, భీమదేవరపల్లి



ఉత్తర తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన ఆలయం కొత్తకొండ వీరభద్ర బ్రహ్మోత్సవాలు ముగిసినప్పటికీని భక్తులతో కిటకిటలాడుతూ ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటుంది. గురువారం తరాలపల్లి గ్రామానికి చెందిన ఓ బాలుడి భక్తికి భక్తులు ముగ్ధులు అవుతున్నారు. తల్లిదండ్రులు చూపించిన మార్గంలో సమాజానికి దిక్సూచిగా హైందవ ధర్మం ప్రతి వ్యక్తికి మంచి మార్గాన్నించే ఆధ్యాత్మిక భావనతో కొత్తకొండ వీరన్నకు మొక్కిన మొక్కును గురువారము భద్రకాళి సమేత వీరభద్రునికి కుష్మాండము గుమ్మడికాయ మొక్కుబడి సమర్పించాడు. అనంతరం మొగిలిపాలెం రాంబాబు కొత్తకొండ వీరన్న సమేత భద్రకాళి దేవి దివ్య ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆశీర్వదించారు.



# స్థానిక సమరానికి సై

- రిజర్వేషన్ కొరకు ఆశావాహులు ఎదురుచూపు
- పల్లెల్లో ప్రారంభమైన విందులు

ఆర్మూర్, విశాల భారతి.

స్థానిక సంస్థల ఎన్నికలలో పోటీ చేయడానికి ఆశావాహులు సై అంటున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు అమలు చేయడమే ఆలస్యం! కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి ఎన్నికలు కావడంతో సత్తా చాటాలని భావిస్తుంది, గ్రామస్థాయిలో ఉన్న కార్యకర్తలలో గెలిచేవారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ప్రచారం తమ పార్టీకి చెందిన అభ్యర్థులను సర్పంచ్ పదవిని చేపట్టాలని నాయకులు కార్యకర్తలకు చెప్పినట్లు తెలుస్తోంది. సర్పంచ్ ఎన్నికలు ఫిబ్రవరిలో నిర్వహించినట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసూరి అనసూయ (సీతక్క) ప్రకటించారు రాష్ట్ర ముఖ్యమంత్రి అమెరికాలోని దావోస్ పర్యటన ముగించుకుని రాగానే బీసీ రిజర్వేషన్లపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. 10 సంవత్సరాలు పాలించిన బిఆర్ఎస్ పార్టీ సర్పంచులను పట్టించుకోలేదని విమర్శలు ఉన్నాయి. సర్పంచులు కొన్ని సందర్భాలలో హైదరాబాదులోని ధర్నాలు నిర్వహించారు.

**ఫుల్ జోష్ లో ఆశావాహులు**

ప్రభుత్వం రిజర్వేషన్లు ప్రకటించగానే ఆయా గ్రామ పంచాయతీలలో రిజర్వేషన్లు చూసుకొని ఎలాగైనా సర్పంచ్ కావాలని ఆశావాహులు ఇప్పటినుండే యువతను మచ్చిక చేసుకొనేపనిలో ఉన్నారు. కొందరైతే విందులకు తెర లేపారు. గ్రామాలలోని హోటల్, కూడళ్ల వద్ద ఎక్కడ చూసినా సర్పంచ్ ఎన్నికల గురించి మాట్లాడుకుంటున్నట్లు తెలుస్తోంది.

**ఆర్థికంగా చితికిపోయిన మాజీ సర్పంచులు:**

గత పది సంవత్సరాలలో సర్పంచ్ పదవిని అనుభవించిన నాయకులు కొందరు ఆర్థికంగా నష్టపోయినట్లు వాపోతున్నారు. గ్రామస్థాయిలో పనులు చేపట్టిన ఇప్పటివరకు పెట్టిన డబ్బులు రాలేదని నిరాశతో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సర్పంచులకు రావాల్సిన డబ్బులను ఇస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.

**రహస్యంగా ఒప్పందం చేసుకుంటున్న పోటీ చేసే అభ్యర్థులు:**

ప్రభుత్వం రిజర్వేషన్లను ప్రకటించగానే ఏ వర్గానికి రిజర్వేషన్ అనుకూలంగా వస్తదో? అందులో నుండి పోటీ చేసే అభ్యర్థులు ఒప్పందాలు చేసుకుంటున్నట్లు గ్రామాలలో గుసగుసలాడుకుంటున్నారు. పదవులను ఇప్పుడే పంచుకుంటున్నారు. ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలు రసవత్తంగా జరుగుతుందని తెలుస్తోంది.

# పల్లెపోరులో పంచాయతీ ఫైటింగ్

- సమరానికి సై ! అంటే సై !
- ప్రభుత్వ వైఫల్యాలే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీలు
- అమలు కాని ఆరు పథకాలపై "గ్రామసభ"ల్లో నిలదీయాలని పిలుపు
- ఏడాది పాలనలో ప్రజా ప్రభుత్వం అమలు చేసిన పథకాలే లక్ష్యంగా బరిలో కాంగ్రెస్

విశాలభారతి, భీమదేవరపల్లి :

పల్లెల్లో పంచాయతీ షురువైంది. గ్రామసభల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలే ప్రధాన లక్ష్యంగా బరిలో దిగబోతుంది. మరో వైపు అవే హామీలపై నిలదీస్తూ, కాంగ్రెస్ వైఫల్యాలను బిఆర్ఎస్, బిజెపి ప్రజల్లోకి తీసుకెళ్లి సై ! అంటే సై ! పల్లెపోరు పంచాయతీ ఫైటింగ్ కి సిద్ధమవుతున్నారు. గ్రామ స్థాయిలో పార్టీల ప్రతినిధులు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రభుత్వ షెడ్యూల్ ప్రకారం వివిధ పార్టీల ప్రతినిధులు పలు కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. స్థానిక ఎన్నికల ఆశావహులు గ్రామాల్లో తిరుగుతూ అందరినీ పలకరిస్తున్నారు. చిన్న చిన్న శుభకార్యాలకు సైతం హాజరవుతున్నారు. ఎవరికి వారే తమ ప్రాబల్యాన్ని పెంచుకునే దిశగా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీల సభ్యులు పోటాపోటీగా తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ప్రణాళికలు వేసుకుంటున్నారు.



# నూతన ఎస్ఐని సన్మానించిన బిజెపి నాయకులు

విశాలభారతి, ఎల్కతుర్తి

ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్లో నూతనంగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్సై ప్రవీణ్ కుమార్ ను మండల బిజెపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి, శాలువాతో సత్కరించి పూల మొక్క బహుకరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్, నాయకులు కంచర్ల శంకరయ్య, జనగాని కిష్టయ్య, ముస్కె వెంకటేష్ యాదవ్, చిదురాల వెంకటేష్, అల్లి కుమార్, అంబీరు శ్రీనివాస్, కోరే కార్తీక్, సుకినే సుధాకర్, బీట్ల లింగయ్య, మాజీ సర్పంచులు బూర్గుల రామారావు, సామల సురేష్ రెడ్డి, కుడితాడి రాజు, ప్రతాప్, కొమ్మిడి నిరంజన్ రెడ్డి, కార్యకర్తలు దేవులపల్లి కృష్ణంరాజు, దాసరి తేజ, బొక్కలపటి కుమార్, సురేందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

**ఆరే సంఘం సత్కారం:**

నూతనంగా వచ్చిన ఎస్ఐ ప్రవీణ్ కుమార్ ను ఆరే సంఘం నాయకులు చాలువతో సత్కరించారు. ఇంగే భాస్కర్ అంబీర్ శ్రీనివాస్ సుకినే సుధాకర్ సుకినే సంతాజి కుడితాడి రాజు హింగే రవీందర్ బూరుగుల రామారావు చందర్రావు పాల్గొన్నారు



# దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ

- తహసిల్దార్ దూలం మంజుల

సైదాపూర్, విశాల భారతి

సైదాపూర్ మండలంలో సోమారం గ్రామాంలో ప్రజా పాలన గ్రామసభ నిర్వహించారు. తాహసిల్దార్ దూలం మంజుల మాట్లాడుతూ ప్రభుత్వ పథకాల మంజూరు నిరంతర ప్రక్రియ అని అన్నారు. నాలుగు పథకాల లబ్ధిదారుల జాబితా చదివి వినిపించారు. జాబితాలో కొందరు పేర్లు చేర్చలేదని స్థానికులు ఆరోపించగా జాబితాలో పేర్లు రానివారు దరఖాస్తు చేసుకోవాలని ఆమే సూచించారు. సంక్షేమ పథకాలు నిరంతర ప్రక్రియ అని, ప్రజా పాలన కేంద్రాలలో అప్లై చేసుకోవాలని తెలిపారు. ప్రతి పేదవారికి పథకాలు అందేలా కృషి జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెవెన్యూ పరిశీలకులు ప్రదీప్, పంచాయతీ కార్యదర్శి రాజీవ్,వ్యవసాయ విస్తరణ అధికారి తిరుపతి, గ్రామస్తులు గుర్రం ఎల్లయ్య, వీరగోని శంకర్,మహేందర్,సదానందం,కాశపాక అనిల్, శ్రీనివాస్, సదానందం, పడాల తిరుపతి, పడాల రమేష్, అనగోని అశోక్,వెంకటేష్,కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్ బాబు-శ్రీలీల సాంగ్ రికార్డ్



ప్రతీ యేటా సోషల్ మీడియాను షేక్ చేసి టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచే పాటలు కొన్నుంటాయి. ఈ జాబితాలో టాప్‌లో ఉంటుంది కుర్చీమడతపెట్టి సాంగ్. మహేశ్ బాబుశ్రీలీల కాంబోలో వచ్చిన ఈ పాట గుంటూరు కారం సినిమాకే హైలెట్‌గా నిలిచిందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది. అయితే కుర్చీ మడతపెట్టి సాంగ్ మాత్రం ఓ వైపు నెట్టింట ట్రోల్స్ వచ్చినప్పటికీ.. మరోవైపు వాటిన్నింటినీ బీట్ చేస్తూ మిలియన్ల సంఖ్యలో వ్యూస్‌తో సినిమాకు సూపర్ హైప్ క్రియేట్ చేసింది. ఇప్పటికే యూట్యూబ్ మ్యూజిక్ ఈ పాటను 2024కిగాను ఇండియా అఫీషియల్ టాప్ సాంగ్‌గా ప్రకటించిన విషయం తెలిసిందే.తాజాగా ఈ పాట అదిరిపోయే ఫీట్‌ను నమోదు చేసింది. యూట్యూబ్‌లో కుర్చీ మడత పెట్టి ఫుల్ వీడియో సాంగ్ 550 మిలియన్ల వ్యూస్ సాధించి అరుదైన రికార్డు నమోదు చేసింది. ఈ పాట రిలీజ్ చేసిన కొత్తలో మ్యూజిక్ డైరెక్టర్ థమన్, డైరెక్టర్ త్రివిక్రమ్‌పై ట్రోల్స్ వచ్చాయి. అయితే క్యాచీ ట్యూన్, అదిరిపోయే స్కోర్, స్టన్నింగ్ కొరియోగ్రఫీ కుర్చీ మడతపెట్టి సాంగ్‌కు ఖండాంతరాల్లో క్రేజ్ తెచ్చిపెట్టాయి. ఇప్పటికే కుర్చీ మడతపెట్టి బీట్‌కు చీరకట్టులో, మోడ్రన్ డ్రెస్సులలో అమ్మాయిలు ఇరగదీసే ఊరమాస్ స్టెప్పులేస్తూ నెట్టింట చేసిన రీల్స్ ఆన్‌లైన్‌లో హల్‌చల్ చేస్తున్నాయి. మరోవైపు టెక్సాస్ టయోటా సెంటర్‌లో నిర్వహించిన ఎన్‌బీఏ గేమ్ ఈవెంట్‌లో కూడా కుర్చీ మడతపెట్టి పాటకు చిన్నారులు డ్యాన్స్ చేసిన వీడియో కూడా వైరల్ అయింది.

## నేను రిటైర్ అవుతున్నా...

బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం ఛావా . లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహిస్తుండగా.. మ్యాడ్‌డాక్ ఫిల్మ్స్ పతాకంపై దినేశ్ విజన్ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ మూవీ ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో రష్మిక తనకు ఇంత ముఖ్యమైన పాత్ర పోషించే అవకాశం ఇచ్చిన దర్శకనిర్మాతలకు కృతజ్ఞతలు తెలియజేసింది.అంతేకాదు తన పాత్ర ప్రాధాన్యత గురించి తెలియజేస్తూ.. ఫన్నీగా కామెంట్ చేసింది. ఈ అవకాశం ఒక గౌరవంగా భావిస్తున్నా. దక్షిణాది నుండి వచ్చిన ఓ అమ్మాయికి మహారాణిగా యేసుబాయి పాత్ర పోషించే అవకాశం రావడం నా జీవితంలో నేను కోరుకునే అత్యంత గౌరవప్రదమైన.. గొప్ప ప్రత్యేకత కలిగిన విషయం. Chhaava తర్వాత నేను రిటైర్ కావడం సంతోషంగా ఉందని లక్ష్మణ్ సర్‌కు చెబుతున్నానంది రష్మిక మందన్నా అన్నారు.'నేను ఏడ్చే వ్యక్తిని కాదు, కానీ ఈ ట్రైలర్ నన్ను ఏడిపించేసింది. విక్కీ కౌశల్ దేవుడిలా కనిపిస్తున్నాడు.. అతను ఛావా.' అంటూ చెప్పుకొచ్చింది రష్మిక మందన్నా. ఇంతకీ రష్మిక మందన్నా కేవలం తన పాత్రను ద్దేశించి మాత్రమే ఇలా మాట్లాడిందా..? లేదంటే నిజంగా రిటైర్‌మెంట్ తీసుకుంటుందా..? అంటూ నెట్టింట తెగ చర్చ నడుస్తోంది. ఛావా ఫిబ్రవరి 14న విడుదలవుతోంది.



## ఓటీటీలోకి పుష్ప 2




అగ్ర కథానాయకుడు అల్లు అర్జున్ నటించిన ఆల్ టైం బ్లాక్ బస్టర్ చిత్రం పుష్ప 2 ది రూల్ . పుష్ప పార్ట్ 1 సినిమాకి సీక్వెల్‌గా వచ్చిన ఈ సినిమాకు సుకుమార్ దర్శకత్వం వహించాడు. డిసెంబర్ 05న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం టాలీవుడ్‌తో పాటు ఇండియన్ బాక్సాఫీస్ వద్ద అన్ని రికార్డులను తిరగరాసింది. కేవలం హిందీలోనే రూ.900 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం వరల్డ్ వైడ్‌గా ఇప్పటివరకు రూ.1850 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. మరోవైపు తాజాగా పుష్ప రీ లోడెడ్ వెర్షన్ అంటూ 20 నిమిషాలు అదనంగా జోడించడంతో మళ్లీ థియేటర్లకు క్యూ కడుతున్నారు జనాలు. ఇదిలావుంటే ఈ సినిమా ఎప్పుడు ఓటీటీలోకి వస్తుందా ఎప్పుడెప్పుడు చూద్దామా అని ఓటీటీ ప్రేక్షకులు తెగ ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ చిత్రం ఓటీటీకి సంబంధించి ఒక వార్త సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమా జనవరి 30 లేదా 31 నుంచి ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు తెలుస్తుంది. అయితే ఓటీటీ వెర్షన్‌లో రన్‌టైం దాదాపు 3 గంటల 44 నిమిషాలు ఉండబోతున్నట్లు సమాచారం. థియేటర్ వెర్షన్ 3 గంటల 20 నిమిషాలే రన్ అవ్వగా.. దీనికి అదనంగా.. 24 నిమిషాలు ఓటీటీకి జత చేస్తున్నట్లు సమాచారం. కాగా దీనిపై చిత్రబృందం క్లారిటీ ఇవ్వవలసి ఉంది.



## మూడు నెలల జైలు శిక్ష

చెక్‌బౌన్స్ కేసు లో వివాదాస్పద దర్శకుడు రామ్ గోపాల్ వర్మకు ముంబయి అంధేరీ మెజిస్ట్రేట్ కోర్టు మూడు నెలల జైలు శిక్ష విధించడంతో పాటు వర్మపై నాన్‌బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసిన విషయం తెలిసిందే. 2018లో రాంగోపాల్ వర్మపై చెక్‌బౌన్స్ కేసు నమోదు అవ్వగా.. మహేష్‌చంద్ర మిశ్రా అనే వ్యక్తి శ్రీ అనే కంపెనీ పేరుతో వర్మపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి ఈ కేసు విచారణ జరుగుతుండగా.. వర్మ ఒక్కసారి కూడా కోర్టుకు హాజరుకావడం లేదు. దీంతో ఆగ్రహించిన కోర్టు వర్మపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. రాబోయే మూడు నెలల్లో ఫిర్యాదు దారుడికి రూ.3.72 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించింది. లేదంటే మూడు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని మెజిస్ట్రేట్ తీర్పు వెల్లడించింది.అయితే ఈ కేసుకు సంబంధించి ట్విట్టర్ వేదికగా స్పందించారు వర్మ. నా మీద అంధేరి కోర్టు విధించిన శిక్షకు సంబంధించి నేను క్లారిటీ ఇవ్వాలి అనుకుంటున్నాను.. ఇది 7 ఏండ్ల క్రితం నాటి విషయం. నా మాజీ ఉద్యోగితో ₹ 2.38 లక్షల వివాదానికి సంబంధించినది. నా న్యాయవాదులు ఈ ఫిర్యాదుపై విచారణ జరుపుతున్నారు. కేసు ప్రస్తుతం కోర్టులో ఉన్నందున దీని గురించి ఇంతకంటే ఏం చెప్పలేను అంటూ ఆర్జీవీ రాసుకోచ్చాడు.

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gaddam Shyam. RNI No APTEL/2010/32877.